ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 27.0
కనిష్ఠం : 24.0



దెబ్బతిన్న పత్తి పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రతి రైతును ఆదుకుంటాం

» కలెక్టర్ వెట్రిసెల్వి

నూజివీడు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):తుఫాన్ కారణంగా పంటలు దెబ్బతిన్న రైతులు ఆందోళన చెందవద్దని, పంట నష్టపోయిన ప్రతిరైతును ఆదుకునేందుకు చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ వెట్రిసెల్వి భరోసా ఇచ్చారు. నూజివీడు మండలం తుక్కులూరు, రామన్నగూడెం గ్రామాల్లో దెబ్బతిన్న పంటలను ఆమె జిల్లా అధికారులతో కలిసి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో కైకలూరు నియోజకవర్గం ముదినేపల్లి మండలంలో తుఫాన్ ప్రభావం అధికంగా ఉందన్నారు. పంటనష్టాలపై అధికారులు, సిబ్బంది నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. తుక్కులూరు పునరావాస కేంద్రంలో ఉన్న బాధితులకు 25 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులు, రూ.3వేలు నగదును పంపిణీ చేశారు. సబ్‌కలెక్టర్ బి.వినూత్న, జిల్లా వ్యవసాయశాఖ అధికారి హబీబ్‌బాషా, ఉద్యానవనశాఖ సహాయసంచాలకులు కె.సంతోష్, డీఎల్‌డీవో వెంకటరత్నం, ఏడీఏ సుబ్బారావు, తహసీల్దార్ భద్రు, ఎంపీడీవో రాఘవేంద్రనాథ్, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు చెన్నారావు, హేమ పాల్గొన్నారు.

బస్సుల రాకపోకలు యథాతథం

ఏలూరు,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి):మొంథా తుఫాన్ నేపథ్యంలో ఇటీవల రద్దు చేసిన బస్సు సర్వీసులను యథాతథంగా ఏలూరు జిల్లాలో నడుపుతున్నట్టు డీపీటీవో షేక్ షబ్నం తెలిపారు. తుఫాన్ తీవ్రత దృష్ట్యా రాజమండ్రి, కొవ్వూరు, హైదరాబాద్‌కు లగ్జరీ బస్సులను 10 శాతం మేర ఇటీవల నిలుపుదల చేశారు. ఇప్పుడు సహాయక చర్యలన్నీ పూర్తి కావడంతో బస్సులను పూర్తిస్థాయిలో మూడు డిపోల నుంచి గురువారం నుంచి నడుపుతున్నారు.



గుండుగొలనులో విరిగిన చెట్టును తొలగిస్తున్న దృశ్యం

తుఫాన్‌కు.. ఎదురొడ్డారు!

ముందస్తు జాగ్రత్తలతో నష్ట నివారణ

జిల్లా యంత్రాంగం ముందస్తుగా ప్రజలను అప్రమత్తం చేయడం, ముందస్తు జాగ్రత్తలతో మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో ఎటువంటి ప్రాణనష్టం కలుగలేదు. ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గించగలిగారు. జిల్లాలోని 27 మండలాల్లోని 664 గ్రామాల్లో తుఫాన్ ప్రభావం చూపించింది.

» పునరుద్ధరణ పనులపై జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి
» యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు
» విద్యుత్, రోడ్లు, ఇళ్లు దెబ్బతినడంతో రూ.72.26 లక్షల నష్టం

ఏలూరుసిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): . తుఫాన్ సహాయక చర్యలు నిమిత్తం ముందస్తుగానే ఎక్స్‌కవేటర్లు, చెట్లు కట్ చేసే మిషన్లను రెవెన్యూ డివిజనల్ కేంద్రాలు, జాతీయ రహదారిపై ఉంచారు. తుఫాన్ సమయంలో వీచిన పెనుగాలులకు జిల్లాలో 33 కేవీ విద్యుత్ స్తంభాలు, 11 కేవీ విద్యుత్ స్తంభాలు 90 వరకు, విద్యుత్ స్తంభాలు 123 నేలకూలాయి. గంట నుంచి రెండు గంటల్లోనే కొత్తవాటిని ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యాన్ని పునరుద్ధరించారు. రోడ్లపై పడిన చెట్లను ఆర్‌అండ్‌బీ శాఖ చెట్లు కట్ చేసే యంత్రాలతో తొలగించి రవాణా సౌకర్యాలకు ఆటంకం లేకుండా చేశారు. వర్షాల అనంతరం ఆయా గ్రామాల్లో డ్రెయిన్‌లలో మురుగు నిల్వ లేకుండా, రోడ్లపై చెత్త నిల్వలేకుండా పంచాయతీ, మునిసిపల్ అధికారులు పారిశుధ్య పనులను యుద్ధప్రాతిపదికన చేపట్టారు. కాల్వలు, మైనర్ ఇరిగేషన్ చెరువులు, వాగులకు పడిన గండ్లు పూడ్చడం, గట్లు పటిష్ఠం చేసే పనులను చేపట్టారు.

జిల్లాలో 93 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి 3,422 మందిని తరలించి వారికి భోజన, వసతి సదుపాయాలు కల్పించారు. జిల్లాలో 148 వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలందించారు. తుఫాన్ బాధితులకు 25 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, కేజీ పంచదార, కేజీ వంటనూనె, రెండు రకాల కూరగాయలు కేజీ చొప్పున, 30 టన్నుల బియ్యం, 10 టన్నుల నిత్యావసర వస్తువులు, మూడు టన్నుల కూరగాయలు అధికారులు అందజేశారు. తుఫాన్ బాధితులకు ప్రతి వ్యక్తికి రూ.వెయ్యి చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు మొత్తం రూ.34.22 లక్షలు అందజేశారు.

రూ.72.26 లక్షల నష్టం

మొంథా తుపాను అనంతరం సహాయక చర్యలపై జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్, జిల్లా ప్రత్యేకాధికారి కాంతీలాల్ దండే, కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాల మేరకు అధికారులు తుఫాన్ నష్టాలపై ప్రాథమిక అంచనాలు తయారు చేశారు. ఆ ప్రకారం విద్యుత్, రోడ్లు, ఇళ్లు దెబ్బతిన్న కారణంగా రూ.72.26 లక్షలు నష్టం వాటిల్లినట్టు పేర్కొన్నారు. జిల్లాలో 24 ఇళ్లు దెబ్బతిన్నాయి.

వీడని భారీ వర్షాలు

మొంథా తుఫాన్ తీరం దాటినా జిల్లాలో గురువారం తెల్లవారుజామున దాదాపు నాలుగు గంటల పాటు ఏజెన్సీ ప్రాంతంలో భారీ ఈదురుగాలులతో కుండపోతగా వర్షం కురిసింది. కొండవాగులు పొంగడంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పోలవరం, బుట్టాయిగూడెం మండలాలతో పాటు జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, లింగ పాలెం, కామవరపుకోట మండలాల్లో భారీ వర్షం కురిసింది. గత 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా పోలవరం మండలంలో 94.4 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదు కాగా జిల్లాలో సరాసరి వర్షపాతం 18.6 మి.మీ నమోదైంది. బుట్టాయిగూడెం 89.6, జంగారెడ్డిగూడెం 83.4, కొయ్యలగూడెం 63.8, లింగపాలెం 44.6, కామవరపుకోట 39.8, జీలుగుమిల్లి 22, చింతలపూడి 14.6, ముసునూరు 9.6, టి.నరసాపురం 8.2, ద్వారకాతిరుమల 7.4, భీమడోలు 7.2, చాట్రాయి 5.8, కలిదిండి 5.2, నూజివీడు 4.6, కుక్కునూరు 4.4, ఆగిరిపల్లి 4.2, వేలేరుపాడు 4, పెదవేగి 3.8, కైకలూరు 1.6, దెందులూరు 1.2, ఏలూరు అర్బన్ 1.2, ముదినేపల్లి 0.4 మి.మీ వర్షపాతం నమోదైంది.



నూజివీడు మండలం బత్తులవారిగూడెంలో గురువారం చేపట్టిన పారిశుధ్య పనులు



పోలవరం మండలంలో ఉధృతంగా ప్రవహిస్తున్న గుంజవరం కాలువ

శానిటేషన్, పంట నష్టాల సేకరణపై దృష్టి సారించాలి

» మంత్రి నాదెండ్ల మనోహర్

జిల్లాలో శానిటేషన్, పంట నష్టాల సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. జిల్లాలో తుఫాన్ అనంతరం సహాయక చర్యలపై రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ కార్యదర్శి , తుఫాన్ సహాయక కార్యక్రమాల పర్యవేక్షణ జిల్లా ప్రత్యేకాధికారి కాంతిలాల్ దండే, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జిల్లా అధికారులతో మంత్రి గురువారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మంత్రి మాట్లాడుతూ తుఫాన్ అనంతరం భారీ వర్షాల కారణంగా వరదనీరు ఎక్కడా నిల్వ లేకుండా చూడాలన్నారు. తాగునీరు ఎక్కడా కలుషితం కాకుండా చూడాలని, ఎక్కడా అపరిశుభ్ర వాతావరణం లేకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించాలని, దోమలు పెరగకుండా ఫాగింగ్ చేయించాలన్నారు. అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. తుఫాన్ కారణంగా పంట నష్టపోయినవారి వివరాలు సేకరించాలన్నారు. దెబ్బతిన్న రోడ్లకు సంబంధించి స్వల్ప, దీర్ఘకాలిక మరమ్మతులపై నివేదిక సమర్పించాలని, స్వల్పకాలంలో చేయాల్సిన రోడ్డు మరమ్మతులను తుఫాన్ నిధుల నుంచి చేపట్టాలన్నారు. జేసీ అభిషేక గౌడ, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, ఆర్డీవోలు అచ్యుత్ అంబరీష్, రమణ, వ్యవసాయ, ఉద్యానవన, పశుసంవర్థక, మత్స్యశాఖ, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్, ఏపీఈపీడీసీఎల్, వైద్య ఆరోగ్యశాఖ తదితర శాఖల అధికారులు, తహసీల్దార్లు , ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

సీడ్ పత్తి రైతుల ఆశలపై నీళ్లు

నూజివీడు టౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ సీడ్‌పత్తి రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. పెనుగాలులు, భారీ వర్షాలకు సీడ్ పత్తి మొక్కలు నేలవాలడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇరవై ఏళ్లుగా సీడ్ పత్తిను ఈ ప్రాంతంలో సాగు చేస్తున్నారు. పత్తి విత్తన కంపెనీల వద్ద సీడ్ నిల్వలు ఉండడంతో ప్రసుత్త సీజన్‌లో నూజివీడు డివిజన్‌లో సీడ్ పత్తి సాగు గణనీయంగా తగ్గింది. గతేడాది దాదాపు మూడు వేల ఎకరాల్లో సీడ్ పత్తి సాగవ్వగా ప్రస్తుతం వెయ్యి ఎకరాల్లో మాత్రమే సాగయింది. ప్రస్తుతం సీడ్ పత్తి 120 రోజులు పైబడి సాగులో ఉండగా గత 18 రోజులుగా క్రాసింగ్ ప్రక్రియ (మిగతా 8వ పేజీలో)



పక్కకు వాలిన పత్తి మొక్కలను పైకి లేపి సరి చేస్తున్న కూలీ

లెక్క సరి చేస్తారా?

» నియోజకవర్గమంతా ఒకే రెవెన్యూ డివిజన్ పరిధిలోకి..
» చింతలపూడి చింత తీరేనా..
» ద్వారకాతిరుమల, గణపవరం ఏలూరు డివిజన్‌లోకి..
» తెరపైకి పాత ఏలూరు రెవెన్యూ డివిజన్

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

పరిపాలనా సౌలభ్యం, ప్రజాభీష్టం మేరకు రెవెన్యూ డివిజన్ల పరిధిలో పూర్తి నియోజకవర్గాలు ఉండేలా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. జిల్లాల పునర్విభజనతోపాటు రెవెన్యూ డివిజన్లను ఒక కొలిక్కి తెచ్చే ప్రయత్నం జరుగుతోంది. జిల్లాల పునర్విభజన, రెవెన్యూ సబ్ డివిజన్ కార్యాలయాల ఏర్పాటులో కొన్ని మండలాలను ప్రజల మనోభావాలను పట్టించుకోకుండా వైసీపీ ప్రభుత్వం రెవెన్యూ డివిజన్‌లను మార్చేసింది. ఈ లెక్కలను సరిచేసే దిశగా కూటమి ప్రభుత్వం రెవెన్యూ డివిజన్ పరిధిలో పూర్తి నియోజకవర్గం చేర్చేలా ప్రతిపాదనలను సిద్ధం చేస్తోంది. అధికారులు నుంచి ప్రతిపాదనలు వెళ్లాయి. అంతా సవ్యంగా జరిగితే నవంబరు 10న జరిగే కేబినెట్ సమావేశంలో లెక్కలు సరిచేసే అవకాశం ఉంది. ఏలూరు జిల్లాలో ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్లు, 27 మండలాలు వున్నాయి. ఏలూరు డివిజన్‌లో కైకలూరు, ఏలూరు, దెందులూరు నియోజకవర్గాలతోపాటు ఉంగుటూరులోని గణపవరం మినహా మూడు మండలాలు కలిపి మొత్తం 11 మండలాలు పూర్తిగా ఉన్నాయి. జంగారెడ్డిగూడెం డివిజన్‌లో పోలవరం నియోజకవర్గం, చింతలపూడి నియోజకవర్గంలోని కామవరపుకోట, జంగారెడ్డిగూడెం, గోపాలపురం నియోజకవర్గంలోని ద్వారకాతిరుమల మండలంతో కలిపి 10 మండలాలు వున్నాయి. నూజివీడు సబ్ కలెక్టరేట్‌లో నూజివీడు నియోజకవర్గంతోపాటు, చింతలపూడిలోని చింతలపూడి, లింగపాలెం కలిసి మొత్తం ఆరు మండలాలు ఉన్నాయి. నూజివీడును ఎన్టీఆర్ జిల్లాలోకి, కైకలూరును కృష్ణా జిల్లాలోకి మార్చాలనే డిమాండ్ వుంది. దాదాపు ఇది కొలిక్కి వస్తోందని ప్రజా ప్రతినిధులు, అధికారులు చెబుతున్నారు. అదే జరిగితే గోపాలపురం నియోజకవర్గం పూర్తిగా ఏలూరు జిల్లాలోకి వస్తుందంటున్నారు. ఇక పశ్చిమ గోదావరి జిల్లాలో వున్న గణపవరాన్ని తిరిగి ఏలూరు జిల్లాలోకి మారుస్తారు. అప్పుడు ఏలూరు జిల్లాలో రెండే డివిజన్‌లు వుంటాయని భావిస్తున్నారు. దీనిపై పూర్తి స్పష్టత రావాల్సి వుంది.



సీపీఎం నాయకుడు బాబూరావు కన్నుమూత

» పార్థివ దేహాన్ని ఏలూరు ఆశ్రం మెడికల్ కళాశాలకు అప్పగింత



■ లోపలి పేజీలో..

రెండు ఆర్వోబీల భూసేకరణకు నోటిఫికేషన్ జారీ

ఏలూరుటూటౌన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు ఆర్వోబీల నిర్మాణానికి భూసేకరణ నోటిఫికేషన్‌ను రైల్వే శాఖ జారీ చేసింది. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో పలు రైల్వే గేట్ల వద్ద ట్రాఫిక్‌తో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ఎంపీ మహేశ్‌కుమార్ కేంద్ర ప్రభుత్వం, రైల్వే శాఖాధికారులతో మాట్లాడి 13 ఆర్వోబీలు మంజూరు చేయించారు. తాజా నోటిఫికేషన్ మేరకు ఉంగుటూరు మండలం కైకరంలో 6.87 ఎకరాలు, దెందులూరు మండలం కొత్తగూడెంలో 5.31 ఎకరాల భూసేకరణ కోసం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అభ్యంతరాలు ఉంటే భూ యజమానులు 30 రోజుల్లో తెలపాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

ఒకటిన పింఛన్ల పంపిణీ

ఏలూరుసిటీ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నవంబరు నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా పింఛన్ చెల్లింపులు నవంబరు 1వ తేదీ ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమవుతుందని కలెక్టర్ వెట్రిసెల్వి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 2,60,036 మంది పింఛన్‌దారులకు రూ.113.72 కోట్లు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. జిల్లాలో నూరు శాతం పంపిణీ చేయడానికి చర్యలు తీసుకున్నామని, అనివార్య కారణాల వల్ల పింఛన్ తీసుకోని వారికి 3వ తేదీన పంపిణీ చేస్తారన్నారు. జిల్లాలో 5,074 మంది సచివాలయ, ఇతర ప్రభుత్వ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు.

నేటి నుంచి పంటు రాకపోకలు

నరసాపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):తుఫాన్ కారణంగా నరసాపురం-సఖినేటిపల్లి రేవుల మధ్య నిలి చిన పంటు రాకపోకలను శుక్రవారం నుంచి పునరుద్దరించనున్నారు. ఐదు రోజులుగా గోదావరిలో రాకపోకలు నిలిచి పోవడంతో ప్రజలు చించినాడ వంతెన మీదుగా వెళుతున్నారు. తుఫాన్ వీడినప్పటికీ పంటు, పడవలను మరో ప్రదేశానికి తరలించడంతో వాటిని గురువారం సాయంత్రానికి గోదావరిలోకి తీసుకొచ్చారు. శుక్రవారం నుంచి యధావిధిగా రాకపోకలు సాగుతాయని ఎంపీడీ వో వీరభద్రరావు తెలిపారు.

వెంటాడుతున్న విచారణ

» భీమవరం మున్సిపాలిటీలో అక్రమ పన్నులు
» ఒకరి ఆస్తిపై మరొకరి పేరుతో పన్ను
» బాధితుడి ఫిర్యాదుతో విచారణకు ఆదేశాలు

భీమవరం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):భీమవరం మున్సిపాలిటీలో ఒకరి ఆస్తిపై మరొకరి పేరుతో పన్ను వేసిన వ్యవహారంలో విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. మూడు నెలల్లోగా తుది నివేదిక సమర్పించాలని స్పష్టంచేసింది. మున్సిపల్ పరిపాలన శాఖ అదనపు డైరెక్టర్ పి.మురళీకృష్ణగౌడ్ విచారణాధికారిగా నియమితులయ్యారు. అక్రమ పన్ను వ్యవహారంలో భీమవరం మున్సిపల్ కమిషనర్‌గా పని చేసిన ఎస్.శివరామకృష్ణ, రెవెన్యూ అధికారి డి.సోమశేఖర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్, వార్డు సంక్షేమ కార్యదర్శి పి.చంద్రశేఖర్‌లను బాధ్యులుగా ప్రభుత్వం గుర్తించింది. సదరు ఖాళీ భూమిపై అప్పటికే అసలు యజమానులు పన్ను చెల్లిస్తున్నారు. దానిని వేరొకరి పేరుతో పన్ను వేస్తూ గత అధికారులు నిర్ణయం తీసుకున్నారు. అప్పట్లో రూ.80 వేలు పన్ను వసూలు చేయాల్సి ఉంది. అలా కాకుండా ఉచితంగానే వేరొకరికి అసెస్‌మెంట్ నెంబర్ ఇచ్చేశారు. దీని ఆధారంగానే నర్సాపురం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమార్కులు తప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇది తెలుసు కున్న అసలు భూయజమానులు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీనిపై గతంలోనే విచారణ చేసి తప్పు జరిగినట్టు ప్రభుత్వం గుర్తించింది. తాజాగా అదనపు డైరెక్టర్‌ను మరోసారి దర్యాప్తు చేసేందుకు నియమించారు. మూడు నెలల్లో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం సూచించింది.

ప్రభుత్వ పాఠశాలలకు స్పోర్ట్స్ కిట్లు

ఏలూరు అర్బన్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): క్లస్టర్ (స్కూల్ కాంప్లెక్స్) కేంద్రంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉపయోగపడేలా క్రీడా సామగ్రి (స్పోర్ట్స్ కిట్స్)ను సరఫరా చేయాలని సమగ్రశిక్ష ఉన్నతాధికారులు నిర్ణయించారు. విలువిద్య, అథ్లెటిక్స్, బ్యాడ్మింటన్, బేస్‌బాల్, బాస్కెట్ బాల్, బాక్సింగ్, క్యారమ్స్, చెస్, క్రికెట్, ఫుట్‌బాల్, హాకీ, కబడ్డీ, రగ్బీ, సెపక్‌తక్రా, సాఫ్ట్‌బాల్, టెన్నీకాయిట్, వాలీబాల్, నెట్‌బాల్, ఫెన్సింగ్ తదితర క్రీడలు, ఆటల్లో అవసరమైన 67 రకాల సామగ్రితో కూడిన కిట్లను అందజేయనున్నారు. క్లస్టర్ హెచ్‌ఎం, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా చైర్మన్, కార్యదర్శి పర్యవేక్షణలో ఈ క్రీడా సామగ్రిని పాఠశాలలకు పంపిణీ చేస్తారు. అన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, ఇంటర్మీడియట్ తరగతులున్న సీనియర్ సెకండరీ స్కూల్స్‌కు అందజేయనున్నారు. ఈ పాఠశాలలన్నీ జిల్లాలో 112 క్లస్టర్ల పరిధిలో ఉన్నాయి.



మౌలిక వసతులకు నోచుకోని నూజివీడులోని జగనన్న కాలనీ

గాలికొదిలేశారు..!

అస్తవ్యస్తంగా జగనన్న కాలనీలు.. మౌలిక వసతుల లేమి

ఇళ్లు కాదు గ్రామాలనే నిర్మిస్తున్నాం... అంటూ గత ప్రభుత్వం ఆర్భాటంగా జగనన్న కాలనీలను ఇచ్చినా మౌలిక సదుపాయాల కల్పనలో వెనుకబడటంతో కాలనీల్లో ఆవాసానికి వచ్చిన లబ్ధిదారుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంది. మరోవైపు కాలనీలను ఊరి చివర దాదాపు 2,3 కి.మీ దూరంలో ఇవ్వడంతో అక్కడికి వెళ్లి నివాసం ఉండేందుకు లబ్ధిదారులు వెనుకడుగు వేస్తున్నారు.

(నూజివీడు టౌన్ - ఆంధ్రజ్యోతి)

నూజివీడు పట్టణంలో అన్నవరం, పోతురెడ్డిపల్లి రహదారి పక్కనే రెండు కాలనీ ఇళ్లను, ట్రిపుల్ ఐటీ సమీపంలో కొండగట్టును ఆనుకుని మరో కాలనీని ఏర్పాటు చేయగా ప్రస్తుతం ఆ కాలనీలు పాడుపడిన ఇళ్లతో దర్శన మిస్తున్నాయి. కనీసం డ్రెయినేజీ, రహదారులు నిర్మాణం లేకుండా కాంట్రాక్టర్లతో ఇళ్లు నిర్మింప చేసి ఒక్క రూపాయికే ఆడపడుచులకు రిజి స్ట్రేషన్ చేసి ఇస్తామని గత ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో నూజివీడు, ఆగిరిపల్లి మండలాల్లో తొలివిడతగా జగనన్న కాలనీలను ప్రారంభించగా ముసునూరు, చాట్రాయి మండలాల్లో రెండో విడతలో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణం ప్రారంభించారు. నూజివీడు పట్టణంలోని నాలుగు కాలనీల్లో ఇళ్లను మంజూరు చేయగా, ఎమ్మార్ అప్పారావు కాలనీకి అనుబంధంగా ఉన్న జగనన్న కాలనీలో మాత్రం ఎంతోకొంత నిర్మాణాలు సాగాయి. మిగిలిన మూడు చోట్ల కాంట్రాక్టర్లచే నిర్మాణాలు చేపట్టినా మౌలిక వసతుల కల్పన మరవడంతో మొండిగోడలతో నిలిచిన ఆ ఇళ్లలోకి వెళ్లేందుకు లబ్ధిదారులు వెనుకంజ వేస్తున్నారు. మౌలిక వసతులు కల్పించాలని ఇటీవల అన్నవరం సమీపంలోని జగనన్నకాలనీ వాసులు సీపీఐ ఆధ్వర్యంలో నిరసనకు దిగారు. నూజివీడులో అద్దెలు కట్టలేక అప్పులు చేసి జగనన్నకాలనీల్లో ఇళ్లు కట్టుకున్నా ప్రభుత్వం కనీసం సౌకర్యాలు కల్పించకపోవడంతో అష్టకష్టాలు పడుతున్నామంటూ వాపోతున్నారు. మున్సిపల్ అధికా రులకు, నూజివీడు సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా నేటికీ పరిస్థితి మారలేదని వాపోతున్నారు. తాజాగా తుఫాన్ కారణంగా భారీవర్షాలకు ఆయా కాలనీల్లో కనీసం నడిచే వెళ్లే పరిస్థితి లేదని వాపోతున్నారు.



డ్రెయినేజీ, రోడ్డు సౌకర్యం లేని నూజివీడులోని జగనన్న కాలనీ

జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనపై కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టాలని, అసంపూర్తి ఇళ్లను త్వరితగతిన పూర్తి చేయాలని నూజివీడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి నిమ్మగడ్డ నరసింహ కోరారు. అప్పులు చేసి ఇళ్లు కట్టుకున్నవారు ఇటు కాలనీల్లో ఆవాసం ఉండలేక, అటు అప్పులకు వడ్డీలు కడుతూ మరోవైపు ఇంటి అద్దెలు చెల్లిస్తూ అగచాట్లు పడుతున్నారని, మంత్రి కొలుసు దృష్టి సారించి లబ్ధిదారుల వెతలు తీర్చాలని కోరారు.



పొంగిపొర్లుతున్న కన్నాపురం తూర్పుకాల్వ

మొంథా విలయం సృష్టించి వెళ్లిపోయింది. తుఫాన్ రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. పాలు పోసుకునే దశలో ఉన్న చేలు నేల నంటాయి. అరటి చెట్లు సగానికి విరిగిపడ్డాయి. తమలపాకుల తోటలు నేలవాలాయి. దీంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడిపోయారు. మరోపక్క గురువారం ఉదయం కురిసిన వర్షానికి ఏజెన్సీలో వాగులు పొంగిపొర్లడంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. వివిధ ప్రాంతాల్లో రహదారులు ఛిద్రమయ్యాయి.



ముదినేపల్లి మండలం పెదకామనపూడిలో నేలవాలిన వరి చేను

మొంథా మిగిల్చిన క(న)ష్టం

ఏజెన్సీలో కుండపోత.. పొంగిన కొండవాగులు



పోలవరం/ బుట్టాయగూడెం/ లింగపాలెం/ కొయ్యలగూడెం అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ మూడు రోజుల పాటు ఏజెన్సీలో మోస్తరు వర్షాలు మాత్రమే కురవగా తుఫాను తీరం దాటిన తర్వాత బుధవారం అర్ధరాత్రి నుంచి తెల్లవారు జామువరకు కుండపోత వర్షం కురిసింది. ఏజెన్సీలో పలుచోట్ల కొండవాగులు పొంగి ప్రమాదకరస్థాయిలో ప్రవహించాయి. పోలవరం మండలంలో బుధవారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. గుంజవరం, తానాలకుంట, కొవ్వాడ కాలువలు కల్వర్టులపై పొంగి ప్రవహించాయి. కొత్తపట్టిసీమ, గూటాల, పట్టిసీమ గ్రామాలలో ఏటిగట్టు దిగువన నివాసాలలోకి వర్షపు నీరు చేరి ప్రజానీకం అవస్థలకు గురయ్యారు.

- బుట్టాయగూడెం మండలం కెఆర్ పురం తూర్పు కాలువ, కన్నాపురం పడమట కాలువలు పొంగి ప్రవహించాయి. దీంతో గంటల తరబడి జనాలు వాగుల వద్దనే వేచి ఉన్నారు. కెఆర్ పురం ఐటీడీఏ పీవో కె.రాములు నాయక్, ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, స్పెషల్ ఆఫీసర్ టి.లత, తహసీల్దార్ చల పతిరావు, మండల పార్టీ అధ్యక్షుడు మొగపర్తి సోంబాబు, పోలీసు, రెవెన్యూ సిబ్బంది జనాలు వాగులు దాటకుండా అప్రమత్తం చేశారు.



ఉధృతంగా గుండేరువాగు

- లింగపాలెం, కామవరపుకోట మండలాలను కలిపే గుండేరు వాగుకు వరదనీరు భారీగా రావడంతో అధికారులు అప్రమత్తమ య్యారు. వంతెనపై నుంచి నాలుగు అడుగులమేర వరదనీరు పోటెత్తడంతో లింగపాలెం తహసీల్దార్ నజీముల్లాషా, ఎస్ఐ కేవెంకన్నలు వాగు వద్ద పరిస్థితిని సమీక్షించి ఈ మార్గంలో రాకపోకలు సాగించకుండా కంచె వేశారు. ఈ వంతెనపై నుంచి రాకపోకలు ఆగిపోవడంతో రెండు మండలాలకు చెందిన గ్రామస్తులు, రైతులు, ఇబ్బందులకు గురయ్యారు. వరదనీటి ప్రవాహానికి వంతెన పూర్తిగా ధ్వంసమవ్వడంతో అధికారులు వాహనాలను నిలిపివేసి ప్రమాదకరంగా వాగును దాటేందుకు ప్రయత్నించవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేసారు.
- ఏజెన్సీలో బుధవారం అర్ధరాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో వంకలు, వాగులు పొంగిపొర్లాయి. కన్నాపురం తూర్పు, పడమర కాల్వలు ఉధృతంగా ప్రవహించాయి. అటు పోలవరం, ఇటు బుట్టాయిగూడెం వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొండ ప్రాంతాల నుంచి వచ్చే బైనేరు వాగు కూడా ఉధృతంగా ప్రవహించింది. చుట్టుపక్కల పంట పొలాల్లోకి వరదనీరు చేరింది. కొయ్యల గూడెం నుంచి కన్నా పురం వెళ్లే రహదారి పొంగుటూరు నుంచి యర్నగూడెం వెళ్లే రహదారి చెరువులను తలపించేలా వరదనీరు చేరింది.దిప్ప కాయల పాడు, బయ్యన్నగూడెం, పరింపూడి, పొంగుటూరు గ్రామాల్లో వరి చేలు నీటమునిగాయి. మండలంలో 720 ఎక రాల్లో వరి పంటనష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖాధికారులు తెలిపారు.

ధ్వంసమైన రహదారులు

ఆచంట/నిడమర్రు అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు కారణంగా పలు ప్రధాన రహదారులు ధ్వంసం అయ్యాయి. ఆచంట పోలీసు స్టేషన్ నుంచి మార్కెట్ సెంటర్ వరకు కొత్తగా ఏర్పాటు చేసిన మినీ బైపాస్ రహదారి ప్రస్తుతం పెద్ద పెద్ద గోతులు పడి చెరువు ను తలపిస్తుంది. నిత్యం ఈ రహదారి వెంబడి అనేక వాహ నాలు వెళుతుంటాయి.మండలంలో కోడేరు వద్ద, కొడమంచిలి కచేరి సెంటర్ నుంచి వేమవరం వెళ్ళే రోడ్డు ఇంకా పలు చోట్ల రహదారులు వర్షాలకు ధ్వంసం అయ్యి అధ్వానంగా మారాయి. సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప లువురు కోరుతున్నారు.

నిడమర్రు నుంచి పెదనింద్రకొలను గ్రామానికి సుమారు 5కి.మీ ఉంటుంది. తోకలపల్లి నుంచి మండల కేంద్రానికి రావాలంటే ఇదే ప్రధాన రహదారి. ఈ రహదారిపై తోకలపల్లి, బైనేపల్లి, ఆముదాలపల్లి, ఫత్తేపురం, పెదనింద్రకొలను, దేవర గోపవరం గ్రామాల ప్రజలు ఆధారపడి ఉన్నారు. సుమారు 6 గ్రామాల నుంచి సుమారు 20 వేల జనాభాకు ఈ రహదారి ప్రధానమైనది. ఈ రహ దారి గోతుల వల్ల రాత్రిపూట ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గణపవరం , భీమవరం, తాడేపల్లిగూడెం వెళ్లి చదువు నేర్చుకొనే చిన్నారులు స్కూల్ బస్సులలో ప్రయాణిస్తుంటే గోతుల వల్ల బస్సు ఎగరేసి పడేయడంతో మెడ, నడుము నొప్పితో బాధపడుతున్నారు. స్థానిక ప్రజానిధులు స్పందించి తక్షణం రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



నిడమర్రు నుంచి పెదనింద్రకొలను వెళ్లే రోడ్డులో మోకాలు లోతులో నిలిచిపోయిన రహదారి



చెరువును తలపిస్తున్న పొంగుటూరు- యర్నగూడెం రహదారి



ధ్వంసమైన ఆచంట పోలీసుస్టేషన్-మార్కెట్ సెంటర్‌కు వెళ్లే రోడ్డు

పంటలకు తీరని నష్టం



అయోధ్యలంకలో తుఫాన్ దాటికి పడిపోయిన అరటి తోటలు

పెంటపాడు/ఆచంట/కాళ్ల/ నరసాపురం రూరల్/ ఆగిరిపల్లి/ మండవల్లి అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పెంటపాడు మండలంలో 3 వేల ఎకరాల్లో వరిచేలు పడిపోయినట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం పడిపోయిన పనలను పైకి లేపి కట్టుకునే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. పంటనష్టాన్ని అంచనా వేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఇప్పటికే కొన్ని చేలు వర్షపునీటిలోనే ఉన్నాయి. ఇవి మొలకగా మారితే రైతులకు నష్టం మరింత పెరిగే అవకాశం ఉంది. ఆచంట మండలంలో చాలా ఎకరాల్లో వరి పంట నేలకొరిగి రైతులకు నష్టాన్ని మిగిల్చింది. లంక గ్రామాల్లో అరటి తోట పడిపోయింది. కొన్నిచోట్ల తమలపాకుల తోటలు నేలనంటాయి. అయోధ్యలం కలో సుమారు 30 ఎకరాల్లో తమల పాకులతోటలు,సుమారు 150 ఎకరాల్లో అరటి తోట పడిపోయి రైతులకు నష్టాన్ని మిగిల్చింది. తమను ఆదుకోవాలని ఈ ప్రాంత రైతులు కోరుతున్నారు. కాళ్ళ మండలంలో 3,700 ఎకరాల్లో సాగు జరుగుతుందని, తుఫాన్ కారణంగా దెబ్బతిన్న వరి పంటను అంచనా వేస్తు న్నామని ఏవో రమేష్‌నాయుడు తెలిపారు. నరసాపురం రూరల్ మండలంలో ప్రాథమిక సర్వే ప్రకారం 6,500 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని వ్యవసాయ అధికారులు తెలిపారు. ఆక్వా నష్టాన్ని కూడా సర్వే చేస్తున్నట్టు తెలిపారు. ఆగిరిపల్లి మండ లంలో 349 హెక్టార్లలో మినుము, 89 హెక్టార్లలో వరి, 20 హెకార్లలో పంటలకు నష్టం వాటిల్లింది. మండవల్లి మండలం లోని ఏడు గ్రామాల్లో 1,352 ఎకరాల్లో పంట నష్టం జరినట్టు అధికారులు తెలిపారు.



ఆచంట మండలం అయోధ్యలంకలో పడిపోయిన తమలపాకుల తోటలు



ముదినేపల్లి మండలం పెదపాలపర్రులో మునిగిన వరి



గణపవరంలో వరి పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే ధర్మరాజు

పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక

వరిచేలను పరిశీలించిన పశ్చిమ కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, పత్సమట్ల ధర్మరాజు

గణపవరం/ పెంటపాడు/ తాడేపల్లిగూడెం రూరల్, ఆచంట, పెనుమంట్ర అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా దెబ్బ తిన్న పంటనష్టాలను అంచనా వేసి ప్రభుత్వానికి నివేదించి బాధిత రైతులకు సహాయం అందేలా చూస్తామని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి తెలిపారు. గురువారం మునిగిన పంట పొలాలను ఆమె పరిశీలించారు. గణపవరం మండలంలోని సీహెచ్ అగ్రహారం, కాశీపాడు, ఏ.గోపవరం, వీరేశ్వరపురం గ్రామాల్లో వరి పంటలను ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. ప్రస్తుతం వరిపంట పొట్టదశలో ఉందని యంత్రాలతో పంటలు కోసే పరిస్థితి ఉండదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కూలీల ద్వారా పంట కోయిస్తే అదనపు ఖర్చులవుతాయని దీనికి తోడు దిగుబడులు కూడా తగ్గిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే ధర్మరాజు మాట్లాడుతూ వరిసాగు చేసిన రైతులు ఇప్పటికే నష్టాల్లో కూరుకుపోయారని నేలకొరిగిన వరిపంటను కలెక్టర్‌కి చూపించారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్‌రెడ్డి, జిల్లా వ్యవ సాయ శాఖాధికారి వెంకటేశ్వరరావు, జిల్లా సహకార శాఖాధికారి మురళీ కృష్ణ, తహసీల్దార్ అప్పారావు పాల్గొన్నారు. రావిపాడు గ్రామంలో వర్షాలకు పడిపోయిన చేలను ఎమ్మెల్యే శ్రీని వాస్, వలవల బాబ్జిలతో కలసి పరిశీలించిన అనంతరం సొసైటీలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పండించిన ప్రతీ గింజ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతు లెవ్వరూ ఆందోళన చెంద వద్దన్నారు. సొసైటీ చైర్మన్ ములగాల శివ, ఆర్డీవో ఖతీబ్ కౌసర్‌బనో, గొర్రెల శ్రీధర్, పుల్లా బాబి, కిలపర్తి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు. తాడేపల్లిగూడెం మండలం కృష్ణాయపాలెంలో దెబ్బతిన్న వరిచేలను పరిశీలించారు. తహసీల్దార్ సునీల్ కుమార్, ఎంపీడీవో చంద్రశేఖర్ పాల్గొన్నారు.



ఆచంటలో పడిపోయిన వరి పొలాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వెంకటేశ్వరరావు, ఏడీ మురళీకృష్ణ

పంట నష్టం యాప్‌లో నమోదు చెయ్యండి

ఆచంట, పెనుమంట్ర మండలంలోని పలు గ్రామాల్లో పడి పోయిన పంట పొలాలను జిల్లా వ్యవసాయాధికారి జెడ్ వెంకటేశ్వర రావు, ఏడీ మురళీకృష్ణ , ఏవో నాగరాజులు కలిసి పరిశీలించారు. పంట నష్టం వివరాలను వెంటనే తయారు చేయాలని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. ముంపుకు గురైన వరి చేలలో నీరు బయటకు పోయే విధంగా చర్యలు తీసుకోవాలని పూత దశ నుంచి గింజ గట్టిపడే దశలో పడిపోయిన వరిచేలను కట్టలుగా కట్టుకోవాలని రైతులకు వివరించారు. పెనుమంట్ర మండలం బ్రాహ్మణ చెరువులోని వ్యవసాయ శాఖ కార్యాలయంలో రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఏఈవోలకు రైతుల వివరాలను యాప్‌లో ఏ విధంగా చేస్తున్నారు ? ఎలా చెయ్యాలి ? అనే విషయాలను వివరిం చారు. వివరాలను త్వరితగతిన యాప్‌లో నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు.

ముందుచూపుతో ముంపు తప్పింది !

డ్రెయిన్ల ప్రక్షాళనతో ఉండి నియోజకవర్గానికి తగ్గిన వరద ముంపు

ఫలిస్తున్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు చర్యలు

ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు, ప్రజలు

ఆకివీడు రూరల్ అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ స్పీకర్ కనుమూరు రఘురామకృష్ణరాజు ముందు చూపుతో ముంపు తప్పించారని ఉండి నియోజకవర్గంలోని ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. 2024లో ఆయన ఎమ్మెల్యే అయిన నాటి నుంచి నియోజకవర్గంలోని పంట, మురుగు కాలువలు ప్రక్షాళనపై దృష్టి పెట్టారు. ఉండి ఇన్‌ఫ్రాస్టక్చర్ డవలప్‌మెంట్ ఫండ్ ఏర్పాటు చేసి దాతల సహకారంతో కాలువల ప్రక్షాళన చేపట్టారు. ఆక్రమణలు, ఏళ్ళ తరబడి పేరుకుపోయిన తూడు, గుర్రపుడెక్కను తొలగించేందుకు చర్యలు తీసుకున్నారు. సాగునీరు, తాగునీరు అందించే వెంకయ్యవయ్యేరు, ఉండి కాలువలలో తూడు, గుర్రపుడెక్కలను తొలగించి నీటిఎద్దడి లేకుండా చేశారు. వాటికి అనుసంధానంగా ఉన్న కాలువలను శుభ్రం చేశారు. ఏళ్ల తరబడి ఆధునికీకరణకు నోచుకోని డ్రెయిన్ల ప్రక్షాళన ప్రారంభించారు. ఆకివీడు మండలంలోని రుద్రాయకోడు, చినకాపవరం, ఉప్పుటేరులో కిక్కస, గుర్రపుడెక్క, తొలగించే పనులు ప్రారంభించారు. కాళ్ళ మండలంలోని మొగదిండితో పాటు బొండాడ పంటకాలువ సుమారు 23 కి.మీ మేర ప్రక్షాళన చేశారు. బొండరీ కోడు, దుబ్బల కోడు, చిలుకూరు, మహదేవపట్నం డ్రైన్‌లు రక్కీసుకోడు, ఇస్సుకోడు, మైనర్ డ్రైన్‌లు, బొండాడ , ఓల్డ్‌వై మేజర్ డ్రైన్‌లు ప్రక్షాళన పూర్తయ్యాయి. మిగిలిన డ్రైన్‌లు పనులు ప్రారంభించనున్నారు. జల్లి కాకినాడ, యండగండి, నీలకోడు డ్రైన్‌లు ప్రక్షాళన పూర్తయ్యాయి. కొల్లేరు వరద ముంపు నీటిని నేరుగా సముద్రంలోకి తీసుకెళ్ళే ఉప్పు టేరులో తూడు, కిక్కస తొలగించే పనులు ప్రారంభమ య్యాయి. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళి ఉప్పుటేరు డ్రెడ్జింగ్ పనులు చేపట్టడానికి కృషి చేస్తున్నారు. ఉండి నియోజకవర్గంలో వరద ముంపు ఇబ్బం దులు లేకుండా చేశారని ప్రజలు, రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



రుద్రాయకోడు ప్రక్షాళన పనులు (ఫైల్)

ముంపు బారినుంచి గట్టెక్కాం



పంట, మురుగుకాలువల ఆక్రమణలు తొలగించి బాగు చెయ్యడంతో వరద ముంపు బారినుంచి గట్టెక్కాం. ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ముందు చూపుతో ముప్పు తప్పింది. అధికవర్షాలు, తుఫాను ఎఫెక్టు ఉన్నప్పటికి ప్రశాంతంగానే ఉన్నాం. కురిసిన వర్షపు నీరు నేరుగా మురుగు కాలువలలోనికి వెళ్ళి సముద్రంలోకి వెళ్లిపోతున్నది.

సాగిరాజు సోమరాజు, మాలవానితిప్ప

పుష్కలంగా సాగు, తాగునీరు



కాలువ శివారు, కొల్లేరు తీరప్రాంతం కావడంతో సాగు, తాగునీటి ఎద్దడి ఉండేది. ఎమ్మెల్యే రఘు రామకృష్ణరాజు పాతవయ్యేరు లోని తూడు, గుర్రపు డెక్కను తొలగించేశారు. ప్రస్తుతం శివారు గ్రామాలకు తాగు, సాగునీరు పుష్కలంగా ఉంది. కాలువలలోని నీరు కలుషితమవ్వకుండా, ఆక్వా చెరువుల నీరు కాలువలలో వదలకుండా చర్యలు తీసుకోవడం సంతోషంగా ఉంది.

గురువెల్లి రఘు ప్రసాద్, కళింగగూడెం

తీరం ప్రశాంతం



పీఎం లంక వద్ద సముద్రం

తెరిపిచ్చిన వాతావరణం

సాధారణ స్థితికి జనజీవనం

పేరుపాలెం బీచ్‌లో కొనసాగిన పోలీస్ బందోబస్తు

నరసాపురం/ మొగల్తూరు, అక్టోబరు 30 (ఆంధ్ర జ్యోతి): ఐదు రోజులుగా తుఫాన్ ప్రభావంతో అల్లకల్లోలంగా మారిన సముద్రం ప్రశాంతంగా మారింది. పరిస్థితులు సాధారణ స్థితికి రావడంతో జనజీవనం తేరుకుంది. ఇళ్లకే పరిమితమైన ప్రజలు నిత్యవసరాల కోసం బయటకొచ్చారు. గాలులకు ధ్వంసమైన విద్యుత్ వైర్లు, స్థంబాలను పునరుద్ధరించ డంతో గ్రామాల్లో లైట్లు వెలిగాయి. పునరావాస కేంద్రాలు ఖాళీ అయ్యాయి. ఇటు మత్స్యకారులు వేటకు వెళ్లేందుకు రెడీ అవుతున్నారు. చినలంక వద్ద కోతకు గురైన గట్టు ఇంకా ప్రమాద స్థితిలోనే ఉంది. దీంతో అటువైపు ఎవరూ వెళ్లడం లేదు. వాతావరణం తెరిపివ్వడంతో అధికారులు గ్రామాలకు వెళ్లి జరిగిన నష్టంపై ఆరా తీస్తున్నారు. విప్ నాయకర్, మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, ఇన్‌ఛార్జి రామరాజు, వైసీపీ జిల్లా అధ్యక్షుడు ముదునూరి ప్రసాదరాజు, మత్స్యకార అభివృద్ధి చైర్మన్ కొల్లు పెద్దిరాజు, ఏంఎసీ చైర్మన్ జక్కం శ్రీమన్నారాయణ గ్రామాల్లో పర్యటించారు. మొగల్తూరులో తీరం వెంబడి వాతావరణం గురువారం వేకువ జాము నుంచి కొద్దిసేపు బలమైన గాలులువీచాయి.తీరం వద్ద గల కొబ్బరి, సరుగుడు చెట్లు పలు ప్రాంతాల్లో కూలి పోయాయి. సాగరతీరంలో వేళాంకిణి మాత ఆలయం నుంచి పేరుపాలెం మోళ్ళపర్రు కనకదుర్గ బీచ్ వరకూ సముద్రంలో అండర్ కరెంట్స్ ప్రభావం ఉండటంతో ఆప్రాంతంలో ప్రత్యేక పహరా కాశారు. మత్యకారులు సముద్ర వేటకు వెళ్ళకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకున్నారు. కేపీ పాలెం, పేరుపాలెంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల పరిధిలో ఈదురు గాలులకు చింత, ఉసిరి, టేకు, నల్ల ఇరుగుడు, మామిడి జాతులకు చెందిన అనేక వృక్షాలు నేలకొరిగాయి. పేరుపాలెం బీచ్‌లో సందర్శకులు రాకుండా గురువారం పోలీస్ బందోబస్తు నిర్వహించారు. బీచ్‌కు వెళ్ళే మూడు రోడ్లలో సుమారు అర కిలోమీటరు ముందుగానే సముద్రం చూసేందుకు వచ్చే వారిని ఎస్ఐ జి.వాసు ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది వెనుకకు పంపారు.



నేషనల్ స్పేస్ వీక్‌కు ఎంపికైన భార్గవిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నేషనల్ స్పేస్ వీక్ ప్రోగ్రామ్‌కు తణుకు బాలురోన్నత పాఠశాల విద్యార్థిని ఎంపిక

తణుకు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తణుకు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని సొనుపల్లి ధనభార్గవి నేషనల్ స్పేస్ వీక్ ప్రోగ్రామ్‌కు ఎంపికైంది. గురువారం స్కూలులో విద్యార్థినిని హెచ్‌ఎం పద్మావతి, ఉపాధ్యాయులు అభినందించారు. పాలిసెడ్‌తో ఫార్మింగ్ ద్వారా నీటి వృథా నియంత్రణకు సంబంధించి రూపొందించిన ప్రదర్శనకు ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఎడ్యుకేషన్ తరపున ఢిల్లీలో వచ్చేనెల 6 నుంచి 8 వరకు మూడు రోజులు పాటు జరిగే సైన్సు ఎక్స్‌పోకు ఎంపికైనట్లు వివరించారు. గైడ్ టీచరు మాధవీలత, డీవైఈవో మురళీ సత్యనారాయణతో పాటు ఎంఈవో ఆంజ నేయులు, పాఠశాల ఎస్‌ఎంసీ సభ్యులు విద్యార్థిని అభినందించారు.

అథ్లెటిక్స్‌లో ఎస్‌కేఎస్‌డీ విద్యార్థిని ప్రతిభ



తణుకు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బాలికల అండర్-19 అథెటిక్స్ పోటీల్లో తణుకు ఎస్‌కెఎస్‌డీ జూనియర్ కళాశాల విద్యార్థిని కె.నందినీ రిలేలో ద్వితీయస్థానం సాధించినట్లు ప్రిన్సిపాల్ బి.హిమబిందు తెలిపారు. ఈనెల 22,23 తేదీల్లో పెదవేగి గురుకుల కళా శాలలో నిర్వహించిన పోటీలలో ప్రతిభ చూపినట్టు చెప్పారు. కళాశాల కార్యదర్శి చిట్టూరి సత్య ఉషారాణి అధ్యాపకులు విద్యార్థినిని అభినందించారు.

క్రీడా ప్రోత్సాహకాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు రూరల్, అక్టోబరు 30, (ఆంధ్రజ్యోతి) : జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలలో అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు సాధించిన క్రీడాకారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. నగదు ప్రోత్సాహక పథకం కింద అర్హులైన వారికి పారితోషికం అందించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్) ప్రకటించింది. ఇందుకు సంబంధించి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఏ అజీజ్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రం గర్వించేలా పతకాలు సాధించిన క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు తెలిపారు. అర్హులైన క్రీడాకారులు నవంబర్ 4వ తేదీలోగా తమ దరఖాస్తులను సమర్పించాలన్నారు. sports.ap.gov.in/registration లింకు ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మరింత సమాచారానికి 82473 02497 నంబర్‌లో సంప్రదించాలని అజీజ్ విజ్ఞప్తి చేశారు.



డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుకు వినతిపత్రం అందిస్తున్న సొసైటీ అధ్యక్షులు

గోనె సంచులు, కమీషన్ ఇబ్బందులు తొలగించాలి

పాలకోడేరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోళ్లతోపాటు గోనెసంచులు, దాని ద్వారా వచ్చే కమీషన్ ఇబ్బందును తొలగించి సహకారం బ్యాంక్‌ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని పలు సొసైటీల అధ్యక్షులు గురువారం డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుకు వినతిపత్రం అందించారు. సొసైటీల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నప్పటికీ ఆ సంచులను సొసైటీలే రప్పించుకుని రైతులకు అందించాలన్నట్లుగా జిల్లా అధికారులు చెప్పడం దారుణమన్నారు. ఇప్పటి వరకు జిల్లాలోని సొసైటీ బ్యాంకులకు ధాన్యం కొనుగోలులో రావలసిన కమీషన్ మొత్తం రూ. 70 కోట్లు ఉందని ఆయన దృష్టికి తీసుకువెళ్ళారు. స్పందించిన డిప్యూటీ స్పీకర్ కమిషనర్ అహ్మద్ బాబుకు ఫోన్ ద్వారా వీరి సమస్యలను తెలియజేసి పరిష్కరించాలని తెలిపారు. సొసైటీ బ్యాంక్ అధ్యక్షులు వేగేశ్న కనకరాజు సూరి, కొత్తపల్లి నాగరాజు, నంద్యాల రామరాజు, కలిదిండి కృష్ణంరాజు, బాలాజీ, ప్రణవమూర్తి, వేణు, రామాంజనేయులు తదితరులు ఉన్నారు.

ఆర్యవైశ్య ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ సలహాదారునిగా అంబికా రాజా



అంబికారాజాను సత్కరించిన రెడ్డి అప్పలనాయుడు

ఏలూరు రూరల్, అక్టోబరు 30, (ఆంధ్రజ్యోతి): ఏలూరు నగరానికి చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త, అంబికా గ్రూప్ సంస్థల డైరెక్టర్ అంబికా రాజా ఆర్యవైశ్య ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ సలహాదారునిగా నియమి తులయ్యారు. అంబికా భవన్‌లో గురువారం ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, అంబికా రాజాను కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శాలువాతో సత్కరించి అభినందించారు.అంబికా గ్రూప్ సంస్థల చైర్మన్ అంబికా కృష్ణ, ఏలూరు అర్బన్ జిల్లా ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు, ఒబిలిశెట్టి శ్రావణ్ కుమార్‌గుప్తా,జనసేన నాయకులు, ఆర్యవైశ్య ప్రముఖులు పాల్గొన్నారు.

నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి



వర్క్‌షాప్‌లో పాల్గొన్న నిట్ ఆచార్యులు

పెంటపాడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు నూతన ఆవిష్కరణ లపై దృష్టి సారించాలని తాడేపల్లిగూడెం నిట్ రిజిస్ట్రార్ డాక్టర్ పీ.దినేష్ శంకర్ రెడ్డి అన్నారు. ఏపీ నిట్‌లో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో స్కిల్ స్పార్క్ 1.0 అనే అంశంపై రెండు రోజులు నిర్వహించినున్న వర్క్ షాప్ గురువారం ప్రారంభమైంది. కార్యక్రమానికి ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి డాక్టర్ శ్రీఫణికృష్ణ అధ్యక్షత వహించగా దినేష్‌శంకర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం పాటు పడా లన్నారు. డీన్‌లు డాక్టర్ జయరాం, వీ.సందీప్‌లు మాట్లాడుతూ విద్యార్థులు ఏరంగంలో రాణించాలన్నా ప్రాథమిక అంశాలపై అవగాహన, నైపుణ్యాలపై పట్టు సాధించాలన్నారు. కోఆర్డినేటర్లుగా డాక్టర్ శంకర్ , డాక్టర్ రమేష్ , డాక్టర్ కిరణ్ వ్యవహరించారు.

పోలీసులంటే భయం పోగొడతాం

» ప్రజలతో మమేకమై గౌరవాన్ని పెంచుతాం : ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప శివకిశోర్

ఏలూరు క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): 'పోలీస్ అంటే ఇప్పటి వరకు ప్రజల్లో ఒక భయం ఉంది. ఆ భయాన్ని పోగొట్టి క్షేత్రస్థాయిలో ప్రజలకు దగ్గరై పోలీస్‌పై గౌరవ మర్యాదలు పెంచడానికి ప్రజలతో మమేకం అవ్వడానికి పోలీస్ ఓపెన్‌హౌస్ ఏర్పాటు చేశాం' అని జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిశోర్ అన్నారు. పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని సెయింట్ థెరిస్సా హైస్కూలు విద్యార్థిని మాగంటి కల్యాణి చేత ప్రారంభింప చేయించారు. ఈ సందర్భంగా ఎస్పీ విద్యార్థులతో ముచ్చటించారు. పోలీసులు విధి నిర్వహణలో ఉపయోగించే ఆయుధాలు, డ్రోన్ పరికరాల పని తీరు, శక్తిటీమ్ విధులను విద్యార్థుల కు వివరించారు. విద్యార్థులు క్రమ శిక్షణతో విద్య నభ్యసించాలని చిన్ననాటి నుంచే ట్రాఫిక్ నిబంధ నలు, చట్టాలపై అవగాహన పెంచుకో వాలన్నారు. ఏఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఏఆర్ డీఎస్పీ చంద్ర శేఖర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ అబీబ్ బాషా, ఏలూరు త్రీ టౌన్ ఇన్‌స్పెక్టర్ కోటేశ్వరరావు, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు, జిల్లా పోలీస్ అధికారుల సంఘ నాయకులు ఆర్. నాగేశ్వరరావు, శానం రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



బాంబు గురించి వివరిస్తున్న పోలీస్ సిబ్బంది

మైకుతో కంప్లైంట్‌ను రికార్డు చేస్తున్న సిబ్బంది





పోలీస్ డాగ్‌ను చూపిస్తున్న ఎస్పీ





విద్యార్థులకు జాకెట్ ధరించడం వల్ల ఉపయోగాలను వివరిస్తున్న ఫైర్ సిబ్బంది.. విద్యార్థినులకు డ్రోన్ కెమెరా గురించి వివరిస్తున్న సిబ్బంది

వెయిట్ లిఫ్టింగ్‌లో గోపాలకృష్ణయ్య విద్యార్థినుల ప్రతిభ



ఏలూరు రూరల్, అక్టోబరు 30, (ఆంధ్ర జ్యోతి) : స్థానిక ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ఉన్నత పాఠశాల విద్యార్థినులు గుంటూరులో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి పథకాలు సాధించారు. పలు విభాగాల్లో ఎం.పావని, బంగారు పతకం, ఎం.దీక్షిత రజిత పతకం, జి.పవిత్ర రజిత, సీహెచ్ కీర్తన బంగారు పతకం సాధించారు. వీరిలో ఎం.పావని, సీహెచ్ కీర్తన జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని, పాఠశాల హెచ్‌ఎం కాంతి జయకుమార్ తెలిపారు.

అయ్యో పాపం..

పెన్షన్ రాకుండానే దివ్యాంగురాలి మృతి



మాధవి (ఫైల్)

ముదినేపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పెన్షన్ పొందేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించకుండానే ముదినేపల్లికి చెందిన దివ్యాంగురాలు గోన మాధవి(35) తనువు చాలించింది. కొంతకాలంగా తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్న ఆమె గురువారం మరణించింది. ఆమెకు పన్నెండేళ్ల కుమార్తె, పదేళ్ల కుమారుడు ఉన్నారు. పదేళ్ల క్రితం రెండో కాన్పులో బాలింత వ్యాధికి గురై ఆమెకు రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ సదరం సర్టిఫికెట్ లభించలేదు. ఆర్థిక ఇబ్బందులతో ఆరోగ్యం క్షీణించి మరణించింది. ఆమె అంత్యక్రియలకు అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి రూ. 5 వేలు ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.



ఏలూరు కలెక్టరేట్ ఏవో నాంచారయ్యకు వినతిపత్రాన్ని అందజేస్తున్న ఫ్యాప్టో జిల్లా నాయకులు

ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్‌పై స్పష్టత ఇవ్వాలి

» ఫ్యాప్టో జిల్లా నాయకుల డిమాండ్

ఏలూరుఅర్బన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ పరీక్షపై రాష్ట్రప్రభుత్వం స్పష్టతనివ్వాలని ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య(ఫ్యాప్టో) జిల్లా నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక కలెక్టరేట్ పరిపాలనాధికారి నాంచారయ్యను, డీఈవో వెంకటలక్ష్మమ్మను కలిసి వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఫ్యాప్టో సభ్య సంఘాల జిల్లా చైర్మన్ మోహన్, సెక్రటరీ జనరల్ ఆదినారాయణ మాట్లాడుతూ ఇన్‌సర్వీస్ టీచర్లను టెట్ నుంచి మినహాయించాలని అభ్యర్థిస్తూ ఫ్యాప్టో రాష్ట్రనాయకత్వం ఇప్పటికే సుప్రీంకోర్టులో రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేసిందని, ప్రభుత్వం తరపున పిటిషన్‌లో ఇంప్లీడ్ కావాలని డిమాండ్ చేశారు. టెట్ తప్పనిసరిపై ఉపాధ్యాయుల్లో ఆందోళన, అయోమయం నెలకొన్నాయన్నారు. పరీక్షనుంచి మినహాయింపునకు కేంద్రప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని, అవసరమైతే చట్టంలో సవరణలు చేసేలా రాష్ట్రప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. పాత పెన్షన్ పునరుద్ధరణ, డీఏ బకాయిల చెల్లింపు, పీఆర్సీ అమలు, ఐఆర్ ప్రకటన, తదితర డిమాండ్లను వినతిపత్రంలో పేర్కొన్నారు. ఫ్యాప్టో సభ్య సంఘాల జిల్లా నాయకులు వెంకటేశ్వరరావు, మనోజ్‌కుమార్, ప్రకాశరావు, రవికుమార్, పవన్‌కుమార్, రామారావు, శివరామ్, శ్రీనివాసరావు, వెంకటరమణ, విద్యాసాగర్, ప్రవీణ్‌కుమార్, హెచ్ఎంల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వైశ్య ఫెడరేషన్ అభివృద్ధికి కృషి చేస్తా

» సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వట్టిపల్లి



వి. వెంకటేశ్వరరావు

టి.నరసాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వట్టిపల్లి వెంకటేశ్వరరావు తెలిపారు. కె.జగ్గవరం గ్రామంలో గురువా రం విలేకరులతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాటా డుతూ ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కోనా శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి రామ్మోహనరావులు తనను రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసినట్లు ఆయన తెలిపారు. తను గతంలో కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ ఏపీ టెలికాం అడ్వైజరీబోర్డు వైస్ చైర్మన్, రైల్వే బోర్డు మెంబర్‌గా పదవులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు. అంకితభావంతో వైశ్య ఫెడరేషన్ బలోపేతానికి కృషి చేస్తామన్నారు. తనకు పదవి రావడానికి కృషి చేసిన వైశ్య సంఘ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. పదవికి వన్నెతెచ్చే విధంగా శక్తివంచన లేకుండా అందరూ సూచనలు, సలహాల మేరకు ఇంటర్నేష నల్ సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.



పోలీసుల అదుపులో ఉన్న నిందితులు

3.195 కేజీల గంజాయి స్వాధీనం

ఆచంట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆచంటలో రూ.6 లక్షల విలువ చేసే 3కేజీల 195 గ్రాముల గంజాయితో పాటు ఆరుగురిని పోలీసులు పట్టుకున్నారు. గురువారం ఆచంట ఎస్ఐ కట్టా వెంకట రమణ తెలిపిన వివరాల ప్రకారం ఆచంట నుంచి మార్టేరు వెళ్లే రోడ్డులో ఆచంటకు సమీపంలో ఒక లేఅవుట్‌లో కొంత మంది గంజాయి విక్రయిస్తున్నారనే సమాచారంతో అలాగే నరసాపురం స్పెషల్ బ్రాంచ్ సమాచారం మేరకు గంజాయి విక్రయిస్తున్న ఆచంటకు చెందిన కోట భాను సందీప్, పెనుగొండకు చెందిన గెద్దాడ సుభాశ్, ఆచంటకు చెందిన వేములూరి ప్రభాశ్, వల్లూరుకు చెందిన చెల్లెం పృథ్వీరాజ్, పెనుమంచిలికి చెందిన నక్కా బాలకృష్ణ, పెనుగొండ రాజుగూడేనికి చెందిన దేవతల కృష్ణబాబు, ఆచంటకు చెందిన వెలగన వాసు నుంచి ఈ గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ తెలిపారు. పెనుగొండ సీఐ రాయుడు విజయకుమార్ ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వెంకట రమణ తెలిపారు. నిందితుల నుంచి మూడు సెల్‌ఫోన్లు, ఒక మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి

నరసాపురం రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని లిఖితపూడి గ్రామంలోని చెరువులో పడి పి.సుబ్బారాయుడు(75) అనే వృద్ధుడు గురువారం మృతి చెందాడు. చెరువులో కాళ్లు కడుక్కునేందుకు దిగి కాలుజారి ప్రమాదశాత్తు లోపల పడిపోయాడు. ఎంతకీ ఇంటికి రాకపోవడంతో వీఆర్వో రామకృష్ణకు సమాచారం అందించారు. మత్స్యకారులు, ఫైర్ అధికారులు గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. సాయంత్రానికి మృతదేహం లభ్యమవడంతో బయటకు తీశారు. విషయం తెలిసి మాజీ ఎమ్మెల్యే మాధవనాయుడు ఘటనా స్థలానికి వెళ్లారు. రెవెన్యూ, పోలీస్ సిబ్బందికి సహాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఎస్.ఐ. వెంకట సురేష్ కేసు నమోదు చేశారు.

రెండు మోటార్ సైకిళ్లు ఢీకొని ఒకరికి గాయాలు

భీమడోలు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):మండలంలోని అంబరుపేట గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ద్వారకాతిరుమల మండలం జాజులకుంట గ్రామానికి చెందిన తానంకి వీర్రాజు అనే వ్యక్తి అంబరుపేట గ్రామం మీదుగా స్వగ్రామానికి మోటార్ సైకిల్‌పై వెళ్తుండగా ఎదురుగా మరో మోటార్ సైకిల్ వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీర్రాజు తలకు తీవ్రగాయమవడంతో విజయవాడ తరలించారు.బాధితుడి ఫిర్యాదుతో భీమడోలు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

ఏలూరు క్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల శ్రీవేంక టేశ్వర స్వామి దర్శనం నిమిత్తం వెళ్లిన వ్యక్తి ఇంటికి తిరిగిరాలేదు. అతని కోసం ఎంత వెతికినా ఆచూకీ కానరాకపోవడంతో ఏలూరు త్రి టౌన్ పోలీసులకు భార్య ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి గా లింపు చర్యలు చేపట్టారు. ఏలూరు రామకృష్ణాపురానికి చెందిన జలగం వెంకటేశ్వరరావు(40)కు భార్య అంజలి కుమారి, ఇద్దరు కుమారులు ఉన్నారు. షాపులకు బిస్కెట్లు, తినుబండారాలను మోటారు సైకిల్‌పై తీసుకెళ్లి విక్రయించే వ్యాపారాన్ని చేస్తున్నాడు. ఈ నెల 2న ద్వారకా తిరుమల వెళ్తున్నాని చెప్పి వెళ్లాడు. అప్పటి నుంచి తి రిగి రాకపోవడం తో ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఏలూరు త్రి టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఏలూరు త్రి టౌన్ సీఐ కోటే శ్వరరావు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఎం నాయకుడు బాబూరావు గుండెపోటుతో మృతి



నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ బొలిశెట్టి.. చింతకాయల బాబూరావు(ఫైల్)

తాడేపల్లిగూడెం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు చింతకాయల బాబూరావు(63) గురువారం రాజమండ్రిలో గుండె పోటుతో మృతిచెందారు. ఆయనకు ఆరేళ్లక్రితం బైపాస్ సర్జరీ జరిగింది. అప్పటి నుంచి పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ వచ్చారు. మూడ్రోజుల నుంచి జ్వరంగా ఉండటంతో తాడేపల్లిగూడెంలోనే నివాసం ఉంటున్నారు.గురువారం ఉదయం చాతిలో కొద్దిగా నొప్పిరావడంతో రాజమండ్రిలోని ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆయన పార్థివ దేహాన్ని పార్టీ నాయకులు, పట్టణ ప్రజలు సందర్శనార్థం తాడేపల్లిగూడెంలోని సుందరయ్య భవనంలో ఉంచారు. సాయంత్రం ఆయన నివాసానికి తరలించారు. కుటుంబ సభ్యుల కోరిక మేరకు శుక్రవారం బాబూరావు పార్థివదేహాన్ని ఏలూరులోని ఆశ్రం కళాశాలకు అప్పగించనున్నారు. సీపీఎం, సీఐటీయూ విభాగంలో కార్మికుల తరపున పోరాడి పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. సుందరయ్య భవనంలోని బాబూరావు భౌతిక కాయాన్ని ప్రభుత్వ విప్, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ సందర్శించి నివాళులర్పించారు. కార్మిక లోకానికి బాబూరావు మృతి తీరని లోటన్నారు. ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి బి.బలరాం, సీపీఎం సీనియర్ నాయకులు మంతెన సీతారాం, వి.ఉమామహేశ్వరరావు, ఎం.సూర్యారావు, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.సుబ్బరావమ్మ, పి.అజయ్ కుమార్, కార్యదర్శి నరసింహరావు, ధనలక్ష్మి, యూటీఎఫ్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కెఎస్ఎస్ ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే ఈలి నాని, సీపీఎం జిల్లా కార్యదర్శి జేవీఎస్ గోపాలన్, కేతా గోపాలన్, కర్రి నాగేశ్వరరావు, పీవీ ప్రతాప్, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు దూసనపూడి సోమసుందర్, సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకుడు మామిడి దానప్రసాద్, కళింగ లక్ష్మణరావు, మండల నాగేశ్వరరావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నేర పరిశోధనలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించాలి: ఎస్పీ



సదస్సులో మాట్లాడుతున్న ఎస్పీ కిశోర్

ఏలూరు క్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసుల పరిష్కారానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్ సూచించారు. ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయం నుంచి నెల వారీ నేర సమీక్షను జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, డీఎస్పీలతో గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ మహిళా, పిల్లల భద్రత, చిన్న పిల్లల ఫిర్యాదులపై శ్రద్ధ చూపాలని, పోక్సో, గంజాయి కేసుల విచారణ వేగవంతంగా చేయాలన్నారు. జూదం, కోడి పందాలు, రికార్డింగ్ డ్యాన్స్‌లు, అశ్లీల ప్రదర్శనలపై అవసరమైతే క్రిమినల్ కేసులు, రౌడీ, సస్పెక్ట్ షీట్లు తెరవాలన్నారు. తరచూ డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించాలని, మద్యం షాపులు నిర్ణీత సమయాల్లో మాత్రమే తెరచి ఉండాలని అన్నారు. ఏఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వరరావు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ అబీబ్ బాషా పాల్గొన్నారు.

సప్తగోకులం సమీపంలో పాము కాటుకు ఆవు, దూడ మృతి!



మృతి చెందిన ఆవు, దూడ

ద్వారకాతిరుమల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీవారి ఆలయ సప్తగోకులం వెనుక దేవస్థానానికి చెందిన ఆవు, దూడ గురువారం ఉదయం అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండటాన్ని సిబ్బంది గుర్తించారు. ఇవి విద్యుత్ షాక్‌తో మృతి చెంది ఉంటాయేమోనని ముందు భావించారు. అయితే సెక్యూరిటీ సిబ్బంది అక్కడికి వచ్చిన రెండు పాములను గుర్తించి హతమార్చినట్టు చెబుతున్నారు. దీంతో అవి పాము కాటుకు మృతి చెంది ఉంటాయని భావిస్తున్నారు. అనంతరం సిబ్బంది, పశు వైద్యులు దానిని పోస్టుమార్టానికి తరలించారు. ప్రతి రోజూ ఉదయం గోపూజ నిమిత్తం గో సంరక్షణశాల నుంచి 9 ఆవులు, 9 దూడలు సప్తగోకులం వద్దకు వస్తాయి. ఈ క్రమంలో ఉదయం ముందుగా వచ్చిన ఆవు దూడలు కాసేపటికి ఐమాస్ట్ పోల్ వద్ద మృతి చెంది ఉన్నాయి. వాటి సమీపంలో పాములు ఉన్నట్టు గుర్తించి వాటిని సిబ్బంది కొట్టి చంపినట్టు అధికారులు చెబుతున్నారు.. దీంతో పాము కాటు వల్లే ఆవు, దూడ మృతిచెంది ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు శాంపిల్స్‌ను విజయవాడలోని వీబీఆర్ఎల్ లేబరేటరీకి పంపుతామని అక్కడి నుంచి వచ్చే పోస్టుమార్టం రిపోర్టు ఆధారంగా వివరాలు వెల్లడిస్తామని పశు వైద్యులు అంగర సురేష్ తెలిపారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



ఏలూరు క్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారిపడి ఒక యువకుడు మృతి చెందాడు. ఏలూరు రైల్వే పోలీసులకు అందిన సమాచారంతో హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఏలూరు రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలోని వీరవల్లి రైలు పట్టాలపై 30 ఏళ్ల యువకుడు మృతి చెంది ఉన్నాడు. వేగంగా వెళ్తున్న రైలు నుంచి జారి పడి మృతి చెందినట్టు ప్రాథమికంగా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలు తెలిస్తే రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ సెల్ నెంబర్ 97047 98990కు సమాచారం ఇవ్వాలని కోరారు.

మృతి చెందిన మేకలు కోసి విక్రయానికి తరలింపు

» అడ్డుకున్న పంచాయతీ కార్యదర్శి

అత్తిలి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అత్తిలి శివారు బొంతువారిపాలెం వెళ్లే రోడ్‌లో మృతి చెందిన మేకలను కోసి విక్రయిస్తున్నారనే ఫిర్యాదుతో అత్తిలి పంచాయతీ కార్యదర్శి భాస్కర్ పరిశీలించారు. తమ పరిశీలనలో నిజమేనని తేలిందని, రేలంగిలో విక్రయిస్తుండగా అడ్డుకున్నట్టు భాస్కర్ తెలిపారు. ఇప్పటి వరకు ఎనిమిది చనిపోయిన మేకలను కోశారని, మరో ఐదు కోయడానికి సిద్ధంగా ఉన్నాయని ఆయన తెలిపారు. ఈ విధంగా మేకలను కోస్తున్న నలుగురిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు భాస్కర్ తెలిపారు. మృతి చెందిన వాటిని కోసి విక్రయించడం చట్ట రీత్యా నేరమన్నారు.

భార్యను హతమార్చిన భర్తకు జీవిత ఖైదు

ఏలూరుక్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): చెడు వ్యసనాలకు బానిసై భార్యను అనుమానిస్తూ మానసికంగా, శారీరకంగా వేధించి రాడ్డుతో తలపై మోది హతమార్చిన భర్తపై నేరం రుజువు కావ డంతో జీవిత ఖైదు, రూ.2 వేల జరిమానా విధి స్తూ ఏలూరులోని రెండవ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి యు.ఇందిరా ప్రియదర్శిని గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం టి.నర్సాపురం మండలం, గ్రామానికి చెందిన కోడూరి మణికంఠ స్వామి(29) చెడు వ్యసనాలకు బానిసయ్యాడు. 2019 జులై 17 రాత్రి ఇంట్లో గొడవపడి రాడ్డుతో భార్య తలపై మోది హతమార్చాడు. ఈ సంఘటనపై అప్పటి చింతల పూడి సీఐ పి.రాజేశ్ కేసు నమోదు చేసి భర్త మణికంఠస్వామిని అరెస్టు చేశారు. ఏలూరులోని రెండవ అదనపు సెషన్స్ కోర్టులో విచారణ జరిగింది. మణికంఠ స్వామిపై కేసు రుజువు కావడంతో జీవిత ఖైదు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి యు.ఇందిరా ప్రియదర్శిని గురువారం తీర్పు చెప్పారు.

భారత రాజ్యాంగంపై వ్యాస రచన పోటీలు

పెదపాడు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక జడ్పీ హైస్కూల్లో భారత రాజ్యాంగ దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించినట్టు ఎంఈవో-2 జంగం రవీంద్ర తెలిపారు. మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు 17 మంది వ్యాస రచన, 13 మంది డిబేట్ పోటీల్లో పాల్గొన్నారన్నారు. మండల స్థాయిలో వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో ఆర్.పావని(వట్లూరు గురుకుల పాఠశాల),పంపన గణేశ్(వీరమ్మకుంట), వి.అలకనంద(జ్యోతి స్కూల్) నిలిచారు. వీరంతా నియోజకవర్గ స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

యథావిధిగా గుబ్బల మంగమ్మ దర్శనాలు

బుట్టాయగూడెం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పశ్చిమ ఏజెన్సీలో కొలువైన గుబ్బల మంగమ్మ దర్శనాలకు భక్తులు ఆదివారం నుంచి రావచ్చ ని ఆలయ కమిటీ తెలిపింది. మొంథా తుఫాన్ కారణంగా నాలుగు రోజుల పాటు అమ్మవారి దర్శనాలకు భక్తులు రాకుండా నిలుపుదల చేశారు. తుఫాను గండం తప్పడంతో వాతావరణం పొడిగా ఉండటంతో భక్తులు అమ్మవారి దర్శనాలకు రావచ్చని తెలిపారు. బుధవారం రాత్రి కుండపోత వర్షానికి, ఈదురు గాలులకు ఆలయ మార్గంలో అక్కడక్కడ చెట్లు పడిపోవడంతో తొలగించినట్లు కమిటీ తెలిపింది.

రంపచోడవరం కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలి

బుట్టాయగూడెం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం కేంద్రంగా రంపచోడవరం, చింతూరు డివిజన్లతో పాటు పోలవరం నియోజకవర్గాన్ని కలిపి ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తెల్లం రామకృష్ణ, పోలోజు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం బుట్టాయగూడెంలో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరుకు 180 కిలో మీటర్ల దూరంలో ఉన్నందున నూతన జిలా ఏర్పాటు చేస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని అమలు చేయాలంటూ గిరిజనులు కోరుతున్నారు. జిల్లా పునర్విభజనలో గతంలో జరిగిన పొరపాట్లను గుర్తించాలని కోరారు. నాయకులు కోర్స జలపాలు, వెట్టి వీరయ్య, కారం సూర్యచంద్రం పాల్గొన్నారు.

అమ్మవారి వేడుకలకు నేడు రాట ఉత్సవం

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తూర్పు వీధిలోని గంగానమ్మ, మహాలక్ష్మమ్మ, పోతురాజుబాబు వార్ల కొలుపులు, జాతర మహోత్సవాలకు శుక్రవారం ముడుపు కట్టి, పందిరి రాట వేసే కార్యక్రమాలు చేపడతామని జాతర కమిటీ అధ్యక్షులు వంకినేని భానుప్రకాష్, జిల్లెళ్ళమూడి నరసింహారావు, మాజీ కార్పొరేటర్ మారం హనుమంతరావు, వంకినేని సాయిబాబాలు తెలిపారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. దక్షిణపువీధిలో గంగానమ్మ, మహాలక్ష్మమ్మ, వినుకొండ అంకమ్మ, పోతురాజుబాబుల జాతరను ఏలూరు సర్వజన సమ్మేళన దక్షిణపువీధి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్టు కమిటీ నాయకులు బలిజ వెంకట అప్పారావు, అద్దేపల్లి శ్రీనివాసరావు, నగిరెడ్డి కాశీ నరేశ్, కార్పొరేటర్ కర్రి శ్రీనివాసరావులు తెలిపారు. శుక్రవారం ఉదయం పడమరవీధి గంగానమ్మ ఆలయం వద్ద అమ్మవారికి స్నానం నిర్వహిస్తామని, అనంతరం పోణంగి రోడ్డులోని జరుగులమ్మ గుడివద్ద ముడుపు కట్టే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, దక్షిణపు వీధిలోని మార్కండేయస్వామి ఆలయం వద్ద రాటా వేయు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఏర్పాట్లు పూర్తి చేశామని కమిటీ నాయకులు తెలిపారు. మరోవైపు తూర్పువీధి, దక్షిణపువీధిలోనూ ఒకేరోజున ముడుపు కట్టడం, రాట మహోత్సవాలు జరుగున్న నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో భక్తుల్లో సందడి నెలకొంది.



డ్యూనాంట్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు డ్యూనాంట్ వర్ధంతి

ఏలూరు క్రైం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రెడ్‌క్రాస్ వ్యవస్థాపకుడు జీన్ హెన్రీ డ్యూనాంట్ వర్ధంతి సందర్భంగా ఏలూరు రెడ్ క్రాస్ సొసైటీ ఆవరణలో ఉన్న డ్యూనాంట్ విగ్రహానికి పూలమాలలు వేసి రెడ్‌క్రాస్ సిబ్బంది నివాళులర్పించారు. జిల్లా రెడ్‌క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, కమిటీ సభ్యుడు మేతర అజయ్‌బాబు మాట్లాడుతూ సర్‌జీన్ హెన్రీ డ్యూనంట్ మానవతా సేవల్లో చూపిన త్యాగం, సేవా భావం అందరికీ ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఆయన ఆలోచనలతోనే రెడ్‌క్రాస్ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ముందుకు సాగుతోందని తెలిపారు. రెడ్ క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, కమిటీ సభ్యులు ఎం.అజయ్ బాబు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలని రైతు కూలీ సంఘం ధర్నా



ధర్నా చేస్తున్న రైతు కూలీ సంఘం

పోలవరం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధిత రైతులను ఆదుకోవాలని గురువారం ఏపీ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం నాయకులు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావం వల్ల రాష్ట్రంలో లక్షలాది ఎకరాల వరి, మినుము, పత్తి, కూరగాయ పంటలు ధ్వంసమయ్యాయని ప్రభుత్వం త్వరిత గతిన సర్వే నిర్వహించి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కూలీలకు పనులు లేక వారం రోజులుగా అవస్థలు పడుతున్నారని వారికి రూ.2 వేలు భృతితో పాటు నిత్యావసరాలు ఉచితంగా సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. వెంకటరెడ్డి గూడెం ఊటకాలువ పూడిక తీత పనులు చేయించాలని, వెంకట రెడ్డిగూడెం నుంచి రామన్నపాలెం వరకూ రోడ్డు మార్గం ఏర్పాటు చేయాలని కోరారు. సవలం రాంబాబు, కొమరం రామారావు పాల్గొన్నారు.




నగరంలో డ్రెయిన్, పరిసరాలను శుభ్రం చేసిన పారిశుధ్యం సిబ్బంది

నగరంలో పారిశుధ్యం కోసం చర్యలు

ఏలూరుటూటౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం వలన నగరంలో ఎక్కడా అపారిశుధ్యం లేకుండా తగు చర్యలు తీసుకున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు. తుఫాన్ నేపథ్యంలో ఏర్పడిన పరిస్థితులను పర్యవేక్షించేందుకు కమిషనర్ గురువారం క్షేత్ర స్థాయిలో పర్యటించారు. మున్సిపల్ సిబ్బందికి తగు ఆదేశాలిస్తూ నగరంలో పడిన వర్షపు నీటిని బయటకు తరలించారు. కమిషనర్ భానుప్రతాప్ మాట్లాడుతూ తుఫాన్ నేపథ్యంలో మూడు రోజుల నుంచి మున్సిపల్ సిబ్బంది నగరమంతా కలియతిరుగుతూ ప్రజలకు ఎటువంటి ఆటంకం కలగకుండా పనులు చేపట్టారన్నారు. నగరంలోని ప్రధాన డ్రెయిన్లలోని ప్లాస్టిక్ వ్యర్థాలు, షిల్టు బయటకు తీసి వర్షపు నీరుపారేలా సిబ్బంది తగిన చర్యలు చేపట్టారని అన్నారు. నగరంలో 16 ప్రాంతాల్లో చెట్లు విరగటం, పడిపోవడం జరిగిందని వెంటనే వాటిని సిబ్బంది తొలగించి ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూశారన్నారు. ఖాళీ స్థలాల్లో గుంటల్లో చేరిన నీటిని ఎప్పటికప్పుడే బయటకు పంపే ఏర్పాట్లు చేశామన్నారు. దోమలు ప్రబలకుండా స్ప్రే, ఫాగింగ్ చేశామన్నారు.

సీడ్ పత్తి రైతుల ఆశలపై నీళ్లు

(5వ పేజీ తరువాయి)

సాగుతోంది. క్రాసింగ్ ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి భారీవర్షాలు కురియడంతో పత్తిలో క్రాసింగ్ సాగక తీవ్రనష్టం వాటిల్లే పరిస్థితి నెలకొంది. మరోవైపు భారీవర్షాలకు పత్తి మొక్క మొదలు బలహీనపడి పక్కకు వాలిపోవడంతో వాటిని లేపి సరిచేసేందుకు రైతులు ప్రయాసలు పడుతున్నారు. సీడ్ పత్తి సాగుకు ఎకరానికి రూ.3లక్షల వరకు ఖర్చవుతుంది. ఇప్పటికి రూ.లక్షన్నర వరకు రైతులు పెట్టుబడులు పెట్టారు. వర్షాల వల్ల క్రాసింగ్ జరగక మూడో వంతు పంట నష్టపోతుండగా మొక్క నిలదొక్కుకునేందుకు మరో పది రోజులు పడుతుందని, ఫలితంగా సగం పంటను నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహకాలు అందడం లేదని, కనీసం వాతావరణ ఆధారిత పంటల బీమాను అమలు చేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారు.

పంటల బీమాను అందించాలి

కాపా శ్రీనివాసరావు, నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్

సీడ్ పత్తి, సీడ్ మొక్కజొన్న రకాలకు రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమాను అమలు చేయాలి. మూడేళ్లుగా తుఫాన్‌ల వల్ల సీడ్ మొక్కజొన్న, సీడ్ పత్తి రైతులు తీవ్రంగా దెబ్బతింటున్నారు. పంటల బీమాను అమలు చేస్తే రైతును ఆదుకునే పరిస్థితి ఉంటుంది.

ప్రమాదంతో ప్రయాణం..



నాటు పడవపై వెళ్తున్న గ్రామస్థులు

కోమటిలంక వాగుతో తప్పని ఇబ్బందులు

నాటు పడవలను ఆశ్రయిస్తున్న గ్రామస్థులు



ఉధృతంగా ప్రవహిస్తున్న కోమటిలంక వాగు

ఏలూరు రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పనికెళ్లే పెద్దలైనా, బడికెళ్లే చిన్నారులైనా రోజూ ఈ సాహసం చేయాల్సిందే.. ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని ముందడుగు వేయాల్సిందే. ఇదీ ఏలూరు రూరల్ మండలంలోని కోమటిలంక గ్రామం దుస్థితి. ఈ గ్రామానికి సరైన దారి లేదు. ఊరి నుంచి బయటకు రావాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఉధృతంగా ప్రవహించే వాగును దాటాలి. వర్షాకాలంలో దాదాపు వారిది ఇదే పరిస్థితి. ఎగువన కురుస్తున్న వర్షాలకు, కొల్లేరులోకి భారీగా వర్షపు నీరు చేరుతోంది.ఈక్రమంలో కోమటిలంక వాగుపై నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. గ్రామానికి రోడ్డు సైతం వాగు మధ్యలోనే ఉంది. దీంతో వాగు పైనుంచి నీరు ప్రవహిస్తుండడంతో ప్రజలు ఊరి నుంచి బయటకు రావాలంటే నాటు పడవల సాయంతో బయటికి రావాల్సిందే. ఈ ప్రయాణంలో అనేకసార్లు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. ఏళ్లు గడుస్తున్నా గ్రామస్థులకు వంతెన సమస్య తీరడం లేదు. వంతెన లేకపోవడంతో ప్రమాదకరంగా పడవలో ప్రయాణించి, రోడ్డుపైకి చేరుకుంటారు. అక్కడి నుంచి బస్సులు, ఇతర వాహనాల్లో తమ గమ్యస్థానాలకు చేరుతుంటారు. వంతెన కల నెరవేరడం లేదు. దీంతో వారికి ఇబ్బందులు తప్పడం లేదు. కూటమి ప్రభుత్వం వంతెన నిర్మిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో సుమారు 700 మంది జనాభా ఉన్నారు. వీరిలో అధిక శాతం మత్స్యకారులే.. వీరంతా చేపల వేట సాగిస్తూ జీవనాధారం పొందుతుంటారు. వాగు పొంగినా లెక్క చేయకుండా ప్రతిసారీ ఏచిన్న అవసరమొచ్చినా నాటు పడవపై ప్రయాణం సాగించాల్సిందే..

నేడు ఎమ్మెల్యే చిర్రి పర్యటన

కొయ్యలగూడెం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కొయ్యలగూడెంలో శుక్రవారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పర్యటించనున్నారు. దీనిలో భాగంగా పరింపూడి ప్రాంతంలో నీట మునిగిన వరి చేలు పరిశీలించనున్నట్టు మండల వ్యవసాయ శాఖాధికారి పోశారావు తెలిపారు.



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రోషన్

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత

లింగపాలెం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాలకు సంక్షేమం, ఆరోగ్యంపట్ల పూర్తి భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే రోషన్ కుమార్ అన్నారు. మండలంలో పుప్పాలవారిగూడేనికి చెందిన లింగారెడ్డి సత్యనారాయణరెడ్డి, భోగోలు గ్రామానికి చెందిన పర్సా రమాదేవికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందించగా కూటమి నాయకులు వెంట ఉన్నారు.



ఏలూరులో సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చంటి



నిడమర్రు : సరుకులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు



జీలుగుమిల్లిలో నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్రి

నిత్యావసరాల పంపిణీ

ముంపు పొలాలు పరిశీలించిన అధికారులు

ఎమ్మెల్యేల చేతుల మీదుగా అందజేత

● పోలవరం: తుఫాన్ పంట నష్టం సర్వే అంచనాలపై మండల వ్యవసాయాధికారి కె.రాంబాబు ఆధ్వర్యంలో స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రైతు సేవా కేంద్రం సిబ్బందికి గురువారం అవగాహన కల్పించారు. త్వరగా పంట నష్టం జాబితా సిద్ధం చేయాలని తహసీల్దారు బి.సాయిరాజు, ఎంపీడీవో చెరుకూరి శ్రీనివాస్‌బాబు సిబ్బందికి సూచించారు.

● పెదపాడు: పునరావాస కేంద్రంలో ఉన్న ఏపూరు గ్రామానికి చెందిన 32 కుటుంబాలను పంపినట్టు తహసీల్దారు కృష్ణజ్యోతి తెలిపారు.నిత్యావసరాల కిట్‌తో పాటు నష్టపరిహారం అందజేశామన్నారు.

● బుట్టాయగూడెం: తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సీపీఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. నాయకులు టి.రామకృష్ణ, పి.నాగేశ్వరరావు, వి.వీరయ్య, కె.జలపాలు రెడ్డిగణపవరం తదితర ప్రాంతాల్లో పర్యటించి తుఫాను కారణంగా నేలవాలిన వరి ఇతర పంటలను పరిశీలించారు.

● ఏలూరు టూటౌన్: తుఫాన్ సహాయక చర్యల్లో పాల్గొన్న అధికారులు, సిబ్బంది, పార్టీ నేతలకు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ కృతజ్ఞతలు తెలిపారు. నాలుగు రోజులుగా ఎంపీ మహేశ్ తుఫాన్ ప్రభావిత ప్రాంతాలపై సమీక్షిస్తూ ప్రజల ఇబ్బందులు పరిష్కరించారు. సీఎం చంద్రబాబు నాయుడు వారం రోజుల నుంచి చేపట్టిన చర్యలతో ప్రాణనష్టం జరగలేదన్నారు.

● ఏలూరుటూటౌన్: తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ సాయం అందుతుందని ఎమ్మెల్యే చంటి అన్నారు. వరద ప్రభావిత ప్రాంతమైన 47వ డివిజన్‌లో బాధితులకు ఎమ్మెల్యే చంటి నిత్యావసరాలు పంపిణీ చేశారు.పునరావాస కేంద్రాల్లోని కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు.

● భీమడోలు: తుఫాన్ ప్రభావంతో నేలకొరిగిన వరి చేలను భీమడోలు తహసీల్దార్ రమాదేవి, ఏవో ఉషారాణి పరిశీలించారు. భీమడోలు, పాతూరు, తదితర గ్రామాల్లో పంట నష్టాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామన్నారు.భీమడోలు ఏఎంసీ చైర్మన్ శేషపుగిరి, నీటి సంఘం అధ్యక్షుడు ప్రసాద్ పాల్గొన్నారు.

● భీమడోలు/నిడమర్రు: భీమడోలు శివారు వడ్లపట్ల ప్రాంతంలోని ఎంపీయూపీ పాఠశాలలో ఉన్న నిర్వాసితులకు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, కూటమి నాయకులు పాల్గొన్నారు. నిడమర్రు మండలంలో భువ్వనపల్లి, ఛానమల్లి గ్రామాల్లో నేలకొరిగిన పొలాలను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నష్టపోయిన రైతుల వివరాలను అధికారులు నమోదు చేస్తున్నారని అన్నారు. అడవికొలను డీసీ చైర్మన్ బేతు వెంకటరామారావు, సొసైటీ అధ్యక్షులు గోలిపుండరీకాక్షుడు, జనసేన నాయకులు నిమ్మల దొరబాబు, అల్లుమోలు అరుణ్ కుమార్, పైడికొండల శివాజి పాల్గొన్నారు. అనంతరం నిడమర్రు మండలం క్రొవ్విడి, ఆముదాలపల్లి గ్రామాల్లో మొంథా తుఫాన్ కారణంగా ఇళ్లు దెబ్బతిన్న 15 కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. తహసీల్దార్ దుర్గాప్రసాద్, ఎంపీడీవో విజయకుమారి, ఆర్.ఐ. జీవన్‌కుమార్, సారికె లెనిన్ బాబు, టీడీపీ నాయకులు ముత్యాల స్వామి, జనసేన నాయకులు వాకమూడి ఇంద్రకుమార్, నిమ్మల దొరబాబు, అరుణ్ కుమార్, ముత్యాల కాశీ, నిమ్మల మౌనిక పాల్గొన్నారు.

● పెదపాడు: నష్టపోయిన ఉద్యాన పంటలకు కౌలు రైతుల పేర్లు నమోదు చేసి పరిహారం చెల్లించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వట్లూరు, పెదపాడు గ్రామాల్లో పర్యటించి పంట నష్టాలను పరిశీలించారు. అన్నదాతలను ఆదుకోవాలని లేదంటే ఆందోళనలు చేస్తామన్నారు. తుమ్మల ధనకోటేశ్వరరావు, కొమ్మన సాంబశివరావు, యాదాల అబ్రహం, కొండలరావు పాల్గొన్నారు.

● జంగారెడ్డిగూడెం: తుఫాన్ ప్రభావంతో గురువారం తెల్లవారు జామున జంగారెడ్డిగూడెం పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలో పలు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. అశ్వారావుపేట రోడ్డు పాత తహసీల్దార్ కార్యాలయం రోడ్డులో వరద కాలువల్లా ప్రవహించింది. మున్సిపల్ కమిషనర్ కె.వి.రమణ, ఏఈ రాజేశ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ ముంపు ప్రాంతాలు పరిశీలించి వరద నీటిని మోటార్ల ద్వారా బయటకు తరలించారు.

● జీలుగుమిల్లి: ప్రభుత్వం చేపటిన ముందస్తు చర్యలతో ఎలాంటి ప్రాణనష్టం సభవించలేదని ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. తుఫాన్ వల్ల ఇబ్బందులు పడుతున్న 57 సంచార కుంబాలను గుర్తించి రూ.3 వేల చొప్పున ఎమ్మెల్యే చిర్రి బాలరాజు సాయం చేశారు. జంగారెడ్డిగూడెం ఆర్డీవో ఎవి.రమణ ఆధ్వర్యంలో నిత్యావసరాలు అందజేశారు. పంట నష్టాన్ని అంచనా వేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారని తెలిపారు. నాయకులు జి.రవికుమార్, పి.రాము, ఎస్.సాయి ఉన్నారు.

● ఏలూరు రూరల్: రూరల్ మండలంలో నీట మునిగిన వరి పొలాలను గురువారం శాస్త్రవేత్తల బృందం ఎంఏవో జీవన సంధ్య ఆధ్వర్యంలో పరిశీలించారు. ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని ఏరువాక కేంద్రం, ఏలూరు శాస్త్రవేత్తలు కె.ఫణికుమార్, ఎస్.నాగేంద్రబాబు మండలంలోని పోణంగి గ్రామంలో ముంపు పొలాలు పరిశీలించారు.

● పెదవేగి: వర్షాల నేపథ్యంలో పెదవేగి మండలం లక్ష్మీపురంలో గ్రామ సర్పంచ్ మేకా కనకరాజు ఆధ్వర్యంలో పారిశుధ్య నిర్వహణ పనులు చేపట్టారు. పెదవేగి ఎంపీడీవో కె.రవికుమార్ పర్యవేక్షణలో ఈవో పీఆర్డీ షరీఫ్, గ్రామకార్యదర్శి కె.వి.ప్రసాద్, మహిళా సంరక్షణ కార్యదర్శి ఎం.జ్యోతి పాల్గొన్నారు.

● ద్వారకాతిరుమల: మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన అరటి పంటలను ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల బృందం గురువారం మండలంలోని పంగిడిగూడెంలో పర్యటించి పరిశీలించారు. విస్తరణ సంచాలకులు బి.గోవిందరాజులు, పీఆర్‌వో చలపతిరావు, ప్రొఫెసర్ కరుణశ్రీ, శాస్త్రవేత్త అర్చన, అమర్‌నాథ్ పాల్గొన్నారు.

● పెదవేగి: పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందిన 75 కుటుంబాలకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గురువారం రాత్రి నిత్యావసరాలు, నగదు అందించారు. పెదవేగి తహసీల్దారు ఎస్డీ.భ్రమరాంబ, ఎంపీడీవో కె.రవికుమార్, శ్రీరాట్నాలమ్మవారి ఆలయ కమిటీ చైర్మన్ మన్నే శ్రీనివాసరావు పాల్గొన్నారు.



పెదపాడులో వరి పనలు పరిశీలిస్తున్న శ్రీనివాస్



జంగారెడ్డిగూడెంలో పడిపోయిన పొలాలు చూపుతున్న రైతులు



పెదవేగి : నిత్యావసరాలు అందజేస్తున్న ఎమ్మెల్యే చింతమనేని



అభినందనలు తెలుపుతున్న ఉపాధ్యాయులు

ఎంఈవో-1గా ప్రభాకర్ బాధ్యతలు

పెదవేగి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖాధికారి-1 గా ఐ.వి.వి.ప్రభాకర్ గురువారం బాధ్యతలు చేపట్టారు. పెదవేగి మండల విద్యాశాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టిన ఆయనను పలువురు ఉపాధ్యాయులు కలిసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల అభ్యున్నతి, పాఠశాలల ప్రగతికి ఉపాధ్యాయులు సహకారం అందించాలన్నారు. పాఠశాలలు అన్ని విధాల పురోభివృద్ధిని సాధిస్తేనే ఉపాధ్యాయుల సంక్షేమం సాధ్యపడుతుందన్నారు. ఉపాధ్యాయులు రమేశ్, నాగార్జున, లక్ష్మీనారాయణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

ఎమ్మెల్యే రాజు వ్యాఖ్యలపై అభ్యంతరం

జీలుగుమిల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): భగవద్గీతపై మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు వ్యాఖ్యలు బాధాకరమని, ఆయన హిందువులకు క్షమాపణలు చెప్పాలని బీజేపీ మండల కార్యదర్శి నల్లమోతు లక్షణ్ అన్నారు. స్థానిక జగదాంబ ఆలయం వద్ద ఎమ్మెల్యే వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సనాతన మూలాలపైన, భగవద్గీతపై ఆయన వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. శ్యామల ప్రసాదరెడ్డి, రేపాక గోపాలరావు, దారా మధు, కక్కిరాల మురళి, పి.దుర్గాప్రసాద్, ఎస్.లక్ష్మీపతి హరీష్ నాయక్ ఉన్నారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

లింగపాలెం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలో పేకాడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్టు ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు. మండలంలోని బాదరాలలో పేకాడుతున్నట్టు సమాచారం రావడంతో దాడి చేసి రూ. 7500 నగదు స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకన్న తెలిపారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

» ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

పెదవేగి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటున్నామని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల కార్యాలయంలో పలువురు ప్రజలు వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ వినతులు అందించారు. ప్రజా సమస్యలు విన్న ఆయన పరిష్కారానికి అనువుగా సంబంధిత శాఖాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్ని అడ్డంకులు ఎదురైనా ప్రజాసమస్యల పరిష్కారానికి రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ప్రతి ఒక్కరి సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనులు చేస్తున్నామని, ఈ విషయంలో కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఎనలేనివన్నారు. మొంథా తుఫాను ప్రభావంతో నష్టపోయిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అండగా నిలుస్తుందని, ఇప్పటికే పంటనష్టంపై అధికారులు గణాంకాలు సిద్ధం చేస్తున్నారని తెలిపారు. పూర్తిస్థాయి నివేదికలు వచ్చిన వెంటనే బాధిత రైతులకు సాయం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. పునరావాస కేంద్రాల్లో నిర్వాసితులకు సరుకులతో పాటు నగదు సాయం కూడా అందిస్తున్నామని ప్రభాకర్ వివరించారు.



చింతలపూడిలో మాట్లాడుతున్న సీఐ క్రాంతికుమార్



భీమడోలులో విద్యార్థినులతో మాట్లాడుతున్న సీఐ

పోలీస్ విధుల గురించి విద్యార్థులకు అవగాహన

కుక్కునూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల వారోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కుక్కునూరు పోలీస్ స్టేషన్ శ్లోకా కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులకు పలు అంశాలపై ఎస్.ఐ. రాజారెడ్డి అవగాహన కల్పించారు.

● లింగపాలెం: పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ధర్మాజీగూడెం పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ నిర్వహించారు. స్థానిక శ్రీవిద్యా పాఠశాల విద్యార్థులు హాజరయ్యారు. ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న విద్యార్థులకు పోలీసులు వివిధ విభాగాల గురించి వివరించారు.

● పోలవరం: పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా పోలవరం పోలీస్ స్టేషన్ ఆవరణలో స్థానిక విద్యార్థులకు పోలీసుల క్రమశిక్షణ, సేవలు, సామాజిక బాధ్యతలపై ఎస్.ఐ. పవన్‌కుమార్ అవగాహనకల్పించారు. స్టేషన్ రైటర్ భీమశేఖర్ పాల్గొన్నారు.

● భీమడోలు: పోలీస్ అమరవీరుల దినోత్సవాల్లో భాగంగా భీమడోలు పోలీసు స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీఐ విల్సన్, ఎస్ఐ మదీనా భాషాలు స్థానిక మానస పాఠశాల విద్యార్థులకు పోలీస్ విధులపై అవగాహన సూచించారు. పోలీస్ సిబ్బంది, ప్రిన్సిపల్ యలమర్తి రవీంద్ర పాల్గొన్నారు.

● చింతలపూడి: చింతలపూడి సీఐ క్రాంతికుమార్ స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఓపెన్ హౌస్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పోలీస్ విధులపై అవగాహన కల్పించారు.



కుక్కునూరులో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

కార్మిక సంఘాల సంక్షేమానికి కృషి

టి.నర్సాపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ కార్మిక సంఘాల సమస్యల పరిష్కారానికి పని చేస్తుందని ఆ సంఘ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ.రవి తెలిపారు. గురువారం స్థానిక ప్రజా సంఘాల కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిర్వహించి విలేకర్ల సమావేశంలో పాల్గొన్నారు. నవంబరు 5, 6 తేదీల్లో టి.నర్సాపురంలో జరిగే ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు జయప్రదం చేయాలన్నారు. ఈ మహాసభల్లో ప్రధానంగా వ్యవసాయ రంగంలో ఉన్న ఇబ్బందులు, సమస్యలపై చర్చిస్తారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘ జాతీయ ప్రధాన కార్యదర్శి వెంకట్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, ముఖ్య అతిధులుగా పాల్గొంటారని తెలిపారు. నవంబర్ 5న మండల కేంద్రంలో భారీ ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందన్నారు. 6న 28 మండలాల్లో ఎంపికైన 200మంది ప్రతినిధులు జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఉద్యమాలు, కార్యక్రమాలపై చర్చ, భవిష్యత్ ప్రణాళిక ఉంటుందన్నారు. సంఘ జిల్లా నాయకులు పిల్లి రామకృష్ణ, గుడెల్లి వెంకట్రావు, సిరిబత్తుల సీతారామయ్య, కిరణ్, రామారావు పాల్గొన్నారు.

కూరగాయల ధరలకు రెక్కలు

ఏలూరుటూటౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం వలన కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి.దీంతో కూరగాయల ధరలకు రెక్కలొచ్చాయి. దీనికి తోడు మధ్యలో దళారిల వ్యవస్థ రాత్రికి రాత్రే రేట్లు పెంచేశారు. తుఫాన్ ప్రభావం వలన కొంత మేర పంటలు దెబ్బతిని దిగుబడి తగ్గింది.



క్రీడాకారులతో సిరాజుద్దీన్, ఇతర సిబ్బంది

ఫుట్‌బాల్ కోచ్ సిరాజుద్దీన్ పదవి విరమణ

ఏలూరు రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఫుట్‌బాల్ కోచ్ సిరాజుద్దీన్ శుక్రవారం పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా గురువారం ఏలూరు ఏఎస్ఆర్ స్టేడియంలో సన్మానం నిర్వహించారు. క్రీడాకారుల అభివృద్ధికి, శాప్ సంస్థ అభివృద్ధికి విశేషంగా కృషి చేశారని వక్తలు కొనియాడారు. శాలువా కప్పి సత్కరించారు. ఫుట్‌బాల్ కోచ్, స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ మాజీ జిల్లా ఆఫీసర్, ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ, డీఎస్ఏ వెస్ట్ గోదావరిలో 36 ఏళ్లు పనిచేశారు. ఏఎస్ఆర్ వాకర్స్ అధ్యక్షులు పత్తిపాటి నాగ విఘ్నేశ్వరరావు, శాప్ శిక్షకులు జేఏసీ ఉద్యోగస్తులు, సీనియర్ ఫుట్‌బాల్ క్రీడాకారులు, ఏఎస్ఆర్ స్టేడియం మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

డ్రెయిన్లలో పూడికతీత పనులు ప్రారంభం

నూజివీడుటౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):ముక్కొల్లుపాడు డ్రెయిన్లలో పూడికతీత పనులను గురువారం ప్రారంభించారు. గ్రామ ఉపసర్పంచ్ కలగర శివసాయి ఆధ్వర్యంలో పోతురెడ్డిపల్లి-ముక్కొల్లుపాడు, రమణక్కపేట-ముక్కొల్లుపాడు రహదారులకు ఇరువైపులా డ్రెయినేజీలో పూడిక తీత పనులను ప్రారంభించారు. రెండేళ్లుగా డ్రెయిన్‌లలో పూడిక తీయకపోవడంతో రహదారిపై మురుగునీరు ప్రవహిస్తుందని గ్రామస్థులు మంత్రి సారథి దృష్టికి తీసుకెళ్లడంతో తక్షణమే డ్రెయిన్‌లలో పూడికతీయాలని ఆదేశించారు. ఈ మేరకు పూడికతీత పనులను ప్రారంభించారు.

పారిశుధ్య నిర్వహణకు వ్యాపారవర్గాలు సహకరించాలి : సబ్ కలెక్టర్

నూజివీడుటౌన్, అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): నూజివీడు పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు వ్యాపారవర్గాలు సహకరించాలని సబ్‌కలెక్టర్ బి.వినూత్న కోరారు. గురువారం ఆమె మాట్లాడుతూ పట్టణంలోని అన్ని దుకాణాలు, మాల్స్ యజమానులు దుకాణాల వద్ద తడి, పొడి చెత్తకు వేర్వేరుగా డబ్బాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. చెత్త నిర్వహణకు వాహనాలు ఉదయం 10.30 నుంచి 11.30 గంటల మధ్య వస్తాయని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే దుకాణదారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



నూగొండపల్లి రహదారిలో వాగు.. అక్కిరెడ్డిగూడెం వాగు వద్ద బందోబస్తు

భారీ వర్షం

- ప్రధాన రహదారుల్లో వాగులు ఉధృతం
- రాకపోకలకు అంతరాయం.. అధికారుల బందోబస్తు

ముసునూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ముసునూరు మండలంలో గురువారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి ప్రధాన రహదారుల్లో వాగులు ఉధృతంగా ప్రహించాయి. అక్కిరెడ్డిగూడెం ప్రధాన రహదారిలో సంధ్యవాగు, లోపూడి-యర్రవారిగూడెం రహదారిలో ఉప్పువాగు, సింహాద్రిపురం-నూజివీడు రహదారిలో రాములేరు, ముసునూరు-వలసపల్లి రహదారిలో సంధ్యవాగు, చెక్కపల్లి-రమణక్కపేట ప్రధాన రహదారిలో ఎర్రకాలువల్లో వరద ఉధృతంగా ప్రహించడంతో రాకపోకలకు అంతరరాయం ఏర్పడింది. ఈ వాగులు ప్రవహించే రహదారుల వద్ద పోలీసులు, రెవెన్యూ, పంచాయతీ అధికారులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. తహసీల్దార్ దాసరి ప్రశాంతి, ఎంపీడీవో పిల్లి ఏసుబాబు, ఎస్‌ఐ ఎం.చిరంజీవిలు వాగుల్లో వరదనీటి ప్రవాహాన్ని పరిశీలించారు. రహదారులపై ప్రవహిస్తున్న నీటిలో ప్రజలు రాకపోకలు సాగించవద్దని అధికారులు సూచించారు. సాయంత్రానికి వాగులో వరద ఉధృతి కాస్త తగ్గుముఖం పట్టింది.

పొంగిన వాగు.. నిలిచిన రాకపోకలు

ఆగిరిపల్లి:తుఫాన్ ప్రభావంతో కురిసిన వర్షాలతో పాటు ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు పలు మార్గాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. మైలవరం, ఖమ్మం ఎగువ ప్రాంతాల్లో బుధవారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షాలతో ఆగిరిపల్లి-నూగొండపల్లి రహదారిలో ఉన్న కుంపిని వాగు పొంగి నూగొండపల్లి, పిన్నమరెడ్డిపల్లి, రాజవరం, ఎస్‌ఎ పేట గ్రామాలకు గురువారం రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసు, రెవెన్యూ అధికారులు, బందోబస్తు నిర్వహించారు.

లాల్వ డ్రెయిన్‌పై డైవర్షన్ రహదారికి సన్నాహాలు



లాల్వ డ్రెయిన్‌పై గండిని పరిశీలిస్తున్న అధికారులు

కలిదిండి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి) : లాల్వ డ్రెయిన్‌పై డైవర్షన్ రహదారి ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ విజయరత్నం అన్నారు. గురువారం కలిదిండి లాల్వ డ్రెయిన్‌పై కూలిన వంతెనను పరిశీలించి మాట్లాడారు. ప్రస్తుతం లాల్వ డ్రెయిన్‌లో 16 తూములు అమర్చి వాటిపై డైవర్షన్ రహదారిని శుక్రవారం సాయంత్రానికి పూర్తి చేస్తామన్నారు. కలిదిండి నుంచి కైకలూరుకు వాహనాలు యథావిధిగా కొనసాగింవచ్చన్నారు. శాశ్వత వంతెన నిర్మాణానికి రూ.3 కోట్లు అంచనాలతో ప్రతిపాదనలు పంపించామని నిధులు మంజూరు కాగానే వంతెన నిర్మిస్తామన్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్‌చౌదరి, కోరుకొల్లు, కలిదిండి డీసీ చైర్మన్లు పేటేటి సత్యనారాయణ, ముద్దం భోగేశ్వరరావు, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా రత్నారావు, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రవీంద్ర, ఆర్‌అండ్‌బీ ఏఈఈ కిషోర్, డీఈఈ అనిల్‌కుమార్, ఏఈఈ భాస్కర్ పాల్గొన్నారు.



ఏక్ భారత్ ఆత్మనిర్భర్ భారత్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

ట్రిపుల్ ఐటీలో సమైక్య పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

నూజివీడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):ఏక్ భారత్ ఆత్మనిర్భర్ సమైక్య పాదయాత్ర పోస్టర్‌ను నూజివీడు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్, ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఎస్. అమరేంద్రకుమార్ గురువారం ఆవిష్కరించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి పురస్కరించుకుని ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సమైక్య పాదయాత్రకు చర్యలు చేపడుతున్నారు. దీనిలో భాగంగా ఆత్మనిర్భర్ భారత్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు కే-2 గ్రౌండ్‌నుంచి నూజివీడు పురవీధుల్లో పాదయాత్రను నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు.

బెల్టుషాపుల సమాచారం ఇవ్వాలి : సీఐ రమేశ్

కైకలూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి):గ్రామాల్లో అనధికార బెల్టుషాపులు నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కైకలూరు ఎక్సైజ్ సీఐ షేక్ రమేశ్ తెలిపారు. గురువారం కైకలూరులో ఆయన మాట్లాడుతూ అనధికార మద్యం దుకాణాలపై మూడు కేసులు నమో దు చేసి ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 33 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మండవల్లి మండలం తక్కెళ్లపాడులో దాడులు నిర్వహించి ఎనిమిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని ముత్యాల మరియమ్మపై కేసు నమోదు చేశామన్నారు. బెల్టుషాపు వివరాలను 94409 02448, 94903 47097, 9966 234473 నంబర్లకు తెలియజేయాలన్నారు. సమాచారం ఇచ్చిన వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

సీడ్ పత్తి రైతుల ఆశలపై నీళ్లు

(5వ పేజీ తరువాయి)

సాగుతోంది. క్రాసింగ్ ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి భారీవర్షాలు కురియడంతో పత్తిలో క్రాసింగ్ సాగక తీవ్రనష్టం వాటిల్లే పరిస్థితి నెలకొంది. మరోవైపు భారీవర్షాలకు పత్తి మొక్క మొదలు బలహీనపడి పక్కకు వాలిపోవడంతో వాటిని లేపి సరిచేసేందుకు రైతులు ప్రయాసలు పడుతున్నారు. సీడ్ పత్తి సాగుకు ఎకరానికి రూ.3లక్షల వరకు ఖర్చవుతుంది. ఇప్పటికి రూ.లక్షన్నర వరకు రైతులు పెట్టుబడులు పెట్టారు. వర్షాల వల్ల క్రాసింగ్ జరగక మూడో వంతు పంట నష్టపోతుండగా మొక్క నిలదొక్కుకునేందుకు మరో పది రోజులు పడుతుందని, ఫలితంగా సగం పంటను నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రోత్సాహకాలు అందడం లేదని, కనీసం వాతావరణ ఆధారిత పంటల బీమాను అమలు చేయకపోవడంతో రైతులు నష్టపోతున్నారు.

పంటల బీమాను అందించాలి



సీడ్ పత్తి, సీడ్ మొక్కజొన్న రకాలకు రాష్ట్రప్రభుత్వం పంటల బీమాను అమలు చేయాలి. మూడేళ్లుగా తుఫాన్‌ల వల్ల సీడ్ మొక్కజొన్న, సీడ్ పత్తి రైతులు తీవ్రంగా దెబ్బతింటున్నారు. పంటల బీమాను అమలు చేస్తే రైతును ఆదుకునే పరిస్థితి ఉంటుంది.

– కాపా శ్రీనివాసరావు, నూజివీడు ఏఎంసీ మాజీ చైర్మన్

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	135, 144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	



పెదపాలపర్రులో నీట మునిగిన వరి పంట..



పెదపాలపర్రులో పంట నష్టాన్ని అంచనా వేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది



గోకర్ణపురం-పైడిచింతపాడు రహదారిని పరిశీలిస్తున్న వడ్డీ సాధికారిక సమితి కన్వీనర్ బలే ఏసురాజు

నీట మునిగిన వరి పంట

- కొన్నిచోట్ల నేలవాలిన పనలు.. రైతుల ఆందోళన

ముదినేపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ఫలితంగా కురిసిన వర్షం, వీచిన ఈదురుగాలులకు ముదినేపల్లి మండలంలో వేలాది ఎకరాల్లోని సార్వా వరి పంటకు తీవ్ర నష్టం కలిగే ప్రమాదం ఏర్పడింది. మరో పది రోజుల్లో కోతలకు సిద్ధంగా ఉన్న ఆయకట్టులోని వరి పైరు గాలులకు నేలమట్టమై నీట మునిగింది. నాలుగు రోజులుగా వరి కంకెలు నీట నానుతుండడంతో పంట చేతికి దక్కడం.. కష్టమేనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పెదపాలపర్రు, కోడూరు, చినపాలపర్రు, సింగరాయపాలెం, కాకరవాడ, ముదినేపల్లి, పెయ్యేరు, దేవపూడి, వాడవల్లి తదితర గ్రామాల్లోని పొలాల్లో ముంపు ఇప్పట్లో తగ్గే అవకాశం కనిపించడం లేదు. మైనర్ డ్రెయిన్‌లో నీటి ప్రవాహం స్తంభించిపోవడంతో వరి పొలాల నుంచి నీటిని బయటికి పంపే మార్గం కనిపించడం లేదు.

నష్టాలపై సర్వే ప్రారంభం

ముదినేపల్లి : కలెక్టర్ వెట్రి సెల్వి ఆదేశాలు మేరకు తుఫాన్ ప్రభావంతో ముదినేపల్లి మండలంలో వరి పంట, ఇతర వ్యవస్థలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు రెవెన్యూ, వ్యవసాయ, విద్యుత్, డ్రెయినేజీ శాఖల అధికారులు గురువారం సర్వే నిర్వహించారు. మండవల్లి ఏడీఏ జి.వెంకటమణి, ఏవో బి.వేణుమాధవ్ ఆధ్వర్యంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, వీఆర్వోలు వరి పంట నష్టం వివరాలు సేకరిస్తున్నారు. విద్యుత్ శాఖ ఏఈ పూర్ణచంద్రరావు ఆధ్వర్యంలో విద్యుత్ లైన్లకు కలిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నారు. సుమారు 50 కొత్త విద్యుత్ స్తంభాలు అవసర మవుతున్నట్లు అధికారులు తెలిపారు. మండలంలో అన్ని శాఖల నివేదికలు అందిన తరువాత పూర్తిస్థాయి నివేదికను కలెక్టర్‌కు పంపుతామని తహసీల్దార్ లతీఫ్ పాషా తెలిపారు.

పంట నష్టం నమోదు చేయాలి : ఏవో



ఆగిరిపల్లి:తుఫాన్ ప్రభావంతో నష్టాలు వాటిల్లిన పంటలను గుర్తించి పారదర్శకంగా నమోదు చేయాలని ఏవో జె.భవాని సిబ్బందిని ఆదేశిం చారు. గురువారం ఆమె మాట్లాడుతూ మండలంలో 349 హెక్టార్లలో మినిము 89 హెక్టార్లలో, వరి 20 హెకార్లలలో పంటలకు నష్టం వాటిల్లి నట్లు తెలిపారు. రైతులు రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి పంట నష్టం నమోదు చేయించుకోవాలని తెలిపారు.

రైతులు నష్టనివారణకు చర్యలు పాటించాలి : ఏడీఏ

మండవల్లి : తుపాన్‌తో పంట నష్టపోతున్న రైతులు నష్టనివారణ చర్యలు పాటించాలని ఏడీఏ వెంకటమణి తెలిపారు. మండవల్లి మండలంలోని పలు గ్రామాల్లో పంట పొలాలను గురువారం ఆమె పరిశీలించి మాట్లాడారు. మండలంలోని ఏడు గ్రామాల్లో 4,300 ఎకరాల్లో వరిసాగు చేస్తున్నట్లు అందులో 1,352 ఎకరాల్లో పంటను నష్టపోయినట్టు చెప్పారు. ఏఈవో శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రాకపోకలు నిలిపివేయండి : ఏసురాజు

కైకలూరు:కొల్లేరుకు వరద రోజురోజుకు పెరుగుతుంది. కైకలూరు మండలంలో ఇప్పటికే గోకర్ణపురం-పైడిచింతపాడు రోడ్డు ముంపునకు గురైంది. ఆటపాక పక్షుల కేంద్రం వద్ద గట్లు అంచును తాకుతూ ఉధృతంగా ప్రవహిస్తుంది. కొల్లేరు గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతు న్నారు. పైడిచింతపాడు రహదారిని టీడీపీ రాష్ట్ర వడ్డీ సాధికారిక సమితి కన్వీనర్ బలే ఏసురాజు పరిశీలించారు. గోకర్ణపురం గ్రామస్థులతో కలిసి రహదారిని పరిశీలించి సూచనలు చేశారు. క్రమే పీ కొల్లేరు పెరుగుతున్నందున ఆ రహదారిలో రాకపోకలు నిలిపివేయాలని సూచించారు. ఇప్ప టికే రహదారిపై పెద్దపెద్ద గోతులు ఉన్నాయని ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలు జరిగే పరిస్థితులున్నాయని రహదారి రాకపోకలను నిలిపివేయాలని గ్రామస్థులకు సూచించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

ముసునూరు : మొంథా తుఫాన్ ప్రభావంతో గుడిపాడుకు చెందిన మందలపు గంగాధర్ నివాస గృహం కూలిపోంది. గురువారం మంత్రి పార్థసారథి ఆదేశాలతో టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు బాధిత కుటుంబానికి అవసరమైన సదుపాయాలను ఏర్పాటు చేసి, మంత్రి అందించిన రూ.5వేలు నగదును అందజేశారు. త్వరలోనే నూతనంగా ఇల్లును నిర్మించే విధంగా చర్యలు తీసుకుంటామని మంత్రి సూచించారని రఘుబాబు తెలిపారు. పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్లి కృష్ణయ్య, వీఆర్వో శారద, పంచాయతీ కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



పోలవరంలో బాధితులకు నగదు, సరుకులు అందిస్తున్న దృశ్యం

తుఫాన్ బాధితులకు నిత్యావసరాలు అందజేత

చాట్రాయి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలవరంలో తుఫాన్ పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందిన మూడు కుటుంబాలకు రూ.3 వేలు చొప్పున నగదు, నిత్యావసర వస్తువులను గురువారం నాయకులు, అధికారులు బాధితులకు అందజేశారు. పోలవరం లేఅవుట్ కాలనీలో మూడు కుటుంబాలకు చెందిన 12 మంది పేదలు గుడిసెలు వేసుకుని జీవిస్తున్న వారిని పునరావాస కేంద్రానికి తరలించి భోజన సదుపాయాలు కల్పించారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు మరిడి చిట్టిబాబు, టీడీపీ గ్రామ అధ్యక్షుడు బిలుగుది జయరాజు, గద్దల లక్ష్మణరావు, వీఆర్వో తేజాకుమారి గ్రామస్థులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో సరుకుల పంపిణీ



ఆగిరిపల్లిలో పంపిణీ చేస్తున్న అధికారులు, నాయకులు

ఆగిరిపల్లి: తుఫాన్ బాధితులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశామని తహసీల్దార్ పీఎస్వీ ప్రసాద్ తెలిపారు. పునరావాస కేంద్రాలలో వున్న నిర్వాసితులకు గురువారం 25 కేజీల బియ్యం, పంచాదార, పామాయిల్, కందిపప్పు, బంగాళా దుంపలు, ఉల్లిపాయలు కేజీ చొప్పున టీడీపీ నాయకులతో కలిసి పంపిణీ చేసినట్లు తెలిపారు. డీటీ జి. పవన్‌కుమార్, టీడీపీ నాయకులు మాదల వెంకట సత్యకుమార్, తదితరులు పాల్గొన్నారు.



వైవాకలో రోడ్డుపైనే దహన సంస్కారాలు

శ్మశాన వాటిక జలమయం

- రోడ్డుపైనే దహన సంస్కారాలు

ముదినేపల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): వైవాక గ్రామంలో చేపల చెరువుల మధ్యన పల్లపు ప్రదేశంలో ఉన్న శ్మశాన వాటిక చెరువుల నీటి వూటకు, వర్షాలకు పూర్తిగా జలమయంగా మారింది. శ్మశాన వాటికలో నిర్వహించాల్సిన మృతుల అంత్యక్రియలు నడిరోడ్డుపైనే నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. శ్మశాన వాటికలోకి ప్రవేశించే అవకాశం లేకుండాపోయింది. పక్కనే ఉన్న మురుగు కాల్వలు పొంగి నీరు రోడ్డు మీదికి రావడంతో శ్మశాన వాటికకు సమీపంలోనే రోడ్డుపైనే చితిని పేర్చి దహన సంస్కారాలు నిర్వహిస్తున్నారు. గురువారం ఆ గ్రామంలో బండారు వెంకటేశ్వరరావు అనే వ్యక్తి మరణించగా, ఆయన దహన సంస్కారాలను కుటుంబ సభ్యులు శ్మశాన వాటికకు వెళ్లే రోడ్డుపైనే నిర్వహించారు. ఇప్పటికైనా గ్రామ పంచాయతీ శ్మశాన వాటికలో మెరక పనులు నిర్వహించి అంత్యక్రియలను శాస్త్రోక్తంగా నిర్వహించుకునేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

గురుకుల పాఠశాలలో ఎస్సీ కమిషన్ చైర్మన్ తనిఖీ

నూజివీడు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి):నూజివీడు బాలయోగి గురుకుల పాఠశాలను రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కేఎస్ జవహర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో అధ్యాపక బృందం విద్యాబోధన పద్ధతులను గురుకులంలో అందిస్తున్న వసతి సౌకర్యాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ సాంఘిక సంక్షేమానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం వేలాదికోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. గురుకులంలోని ప్రతి విద్యార్థి విద్యలో ప్రావీణ్యం సాధించేలా అధ్యాపకులు కృషి చేయాలని సూచించారు. గురుకుల పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.



పెద ఎడ్లగాడి వద్ద నిలిచిన గుర్రపుడెక్క, మద్వానిగూడెం వంతెన వద్ద కిక్కిస, తూడు

కొల్లేరుకు పెరుగుతున్న వరద నీరు

- నీటి ప్రవాహానికి అడ్డుగా నిలిచిన గుర్రపుడెక్క తూడు

మండవల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కొల్లేరుకు పెద్దఎత్తున వరద నీరు పోటెత్తడంతో నిండుకుండలా మారింది. ప్రస్తుతం పెద్దఎడ్లగాడి పెనుమాకలంక ప్రధాన రహదారిపై మూడు అడుగుల మేర నీరు ప్రవహిస్తుంది. తుఫాన్ బీభత్సంతో ఎగువ ప్రాంతం నుంచి కొల్లేరుకు వరద నీరు అంచనాలకు మించి చేరుతుంది. ఇది ఉప్పుటేరు మీదుగా సముద్రంలో కలవాల్సి ఉంది. కొల్లేరు సరస్సులో పెద్దఎడ్లగాడి వద్ద భారీగా గుర్రపుడెక్క మేట వేసుకోవడంతో నీటి ప్రవాహానికి తీవ్ర అడ్డంగా మారింది. ఈమేరకు లంక గ్రామాల జలదిగ్బంధంలో చిక్కుకుంటున్నాయి.

ఉప్పుటేరులో పేరుకుపోయిన డెక్క కిక్కిస

కలిదిండి : మద్వానిగూడెం-ఏలూరుపాడు వంతెన వద్ద ఉప్పుటేరులో దట్టంగా గుర్రపు డెక్క తూడు కిక్కిస పేరుకుపోయింది. ఈ వంతెనకు 16 ఖానాలు ఉండగా, 14 ఖానాలు డెక్క తూడు, కిక్కిసతో పూడిపోయాయి. ఇదే పరిస్థితి కొనసాగితే వంతెన ఎగువన ఉన్న ఉప్పుటేరు వెంబడి గ్రామాలు ముంపు భారిన పడే ప్రమాదం ఉందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ విషయంపై పీడబ్ల్యూడీ ఏఈఈ జయ ప్రకాష్ మాట్లాడుతూ శుక్రవారం ఎక్స్‌కవేటర్లతో కిక్కిస, డెక్క తూడును పూర్తిగా తొలగించి ఉప్పుటేరులో నీటి ప్రవాహం సక్రమంగా జరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

అయ్యో పాపం..

పెన్షన్ రాకుండానే దివ్యాంగురాలి మృతి



మాధవి (ఫైల్)

ముదినేపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పెన్షన్ పొందేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఫలించకుండానే ముదినేపల్లికి చెందిన దివ్యాంగురాలు గోన మాధవి(35) తనువు చాలించింది. కొంతకాలంగా తీవ్ర అస్వస్థతతో బాధపడుతున్న ఆమె గురువారం మరణించింది. ఆమెకు పన్నెండేళ్ల కుమార్తె, పదేళ్ల కుమారుడు ఉన్నారు. పదేళ్ల క్రితం రెండో కాన్పులో బాలింత వ్యాధికి గురై ఆమెకు రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. నడుము నిలబడక నడిచే అవకాశం లేక తల్లి సరోజని సంరక్షణలోనే ఉంటుంది. ఆమెకు పెన్షన్ పొందేందుకు అన్ని అర్హతలు ఉన్నప్పటికీ సదరం సర్టిఫికెట్ లభించలేదు. ఈమేరకు ఆర్థిక ఇబ్బందులతో పోషణ తగ్గి ఆరోగ్యం మరింత క్షీణించి మరణించింది. ఆమె అంత్యక్రియలకు అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి రూ. 5 వేలు ఆర్థిక సాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు.

గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపర్చాలి : జడ్పీ సీఈవో



వలసపల్లిలో చెత్త సేకరణను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో శ్రీహరి

ముసునూరు/కైకలూరు/కలిదిండి/నూజివీడు టౌన్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ వల్ల రహదారులు, డ్రెయినేజీల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి, పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపట్టాలని జడ్పీ సీఈవో శ్రీహరి అధికారులను ఆదేశించారు. గురువారం వలసపల్లిలో జరుగుతున్న పారిశుధ్య పనులు, చెత్త సేకరణ, సంపద కేంద్రాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో డ్రెయినేజీ వ్యవస్థను పునరుద్ధరించాలని, చెత్త సేకరణ చేయాలని సూచించారు. ఎంపీడీవో పిల్లి ఏసుబాబు, డిప్యూటీ ఎంపీడీవో బీఏ సత్యనారాయణ, టీడీపీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు, సిబ్బంది పాల్గొన్నారు. కైకలూరు మండలం ఆటపాకలో ఏలూరు డీఎల్పీవో వై. అమ్మాజీ శానిటైజేషన్ పనులను పరిశీలించారు. ప్రతీ గ్రామంలోనూ క్లోరినేషన్ కచ్చితంగా చేయాలని లేకుంటే చర్యలు తీసుకుంటామన్నారు. కలిదిండి మండలం కోరుకొల్లు, కలిదిండి, తాడినాడ, ఎస్.ఆర్పీఅగ్రహారం, ఆవకూరు, కొచ్చెర్ల, లోడిదలంక గ్రామాల్లో రహదారులపై చెత్తాచెదారం తొలగించి బ్లీచింగ్ చల్లుతున్నారు.

బత్తులవారి గూడెంలో..

నూజివీడు మండలం బత్తులవారిగూడెం గ్రామంలో అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులను చేపట్టారు. గ్రామసర్పంచ్ ముసునూరు లక్ష్మీకాంతమ్మ నేతృత్వంలో పారిశుధ్య మెరుగుదల పనులతో పాటు హెల్త్‌సర్వే, అనంతరం హెల్త్‌క్యాంపును నిర్వహించారు. టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ముసునూరి రాజా, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

'విద్యార్థులకు ఎఫ్ఐఆర్‌పై అవగాహన ఉండాలి'



మండవల్లిలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రామచంద్రరావు

కలిదిండి/ముదినేపల్లి/మండవల్లి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఎఫ్ఐఆర్‌పై అవగాహన ఉండాలని ఎస్ఐ వి.వెంకటేశ్వరరావు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా గురువారం కలిదిండి పోలీస్‌స్టేషన్‌లో విద్యార్థులకు పోలీస్ ఓపెన్ హౌస్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ కేసుల నమోదు, చార్జిషీట్లు, రౌడీషీట్లు, సివిల్, క్రిమినల్ కేసులు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఏఎస్ఐ వెంకటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు. ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు పోలీస్ ఓపెన్ హౌస్ నిర్వహించారు. మండవల్లి పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని ఎస్ఐ రామచంద్రరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండవల్లి విశ్వభారతి పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో రామారావు

క్విజ్ పోటీల విజేతలకు అభినందనలు

కైకలూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవంపై విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారిని ఎంఈవో డి. రామారావు అభినందించారు. గురువారం కైకలూరులో రాజ్యాంగ దినోత్సవంపై క్విజ్‌పోటీల్లో ఓరియంటల్ హైస్కూల్ విద్యార్థి ఎం.చిన్మయి ప్రథమస్థానం, బాలికల జడ్పీ హైస్కూల్‌కు చెందిన ఎ.ఆయేషాసిద్ధిఖా ద్వితీయస్థానం, ఓరియంటల్ హైస్కూల్‌కు చెందిన జి.దిశాలిని తృతీయస్థానం సాధించారు. వీరిని ఎంఈవోలు రామారావు, వి. శ్రీనివాసరావు అభినందించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

సస్యరక్షణ చర్యలపై రైతులకు అవగాహన

ముసునూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో నేలకు ఒరిగిన వరి పంటల్లో పంట నష్టాన్ని అంచనా వేసేందుకు గురువారం గ్రామాల్లో ఏవో చాముండేశ్వరి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. చెక్కపల్లి, గుడిపాడు, ముసునూరు, లోపూడి, వలసపల్లి తదితర గ్రామాల్లో వరి పంటలను పరిశీలించి, సస్యరక్షణ చర్యలపై రైతులకు ఆమె అవగాహన కల్పించారు. త్వరలో పంట నష్టంపై సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. నాయకులు, రైతులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

చాట్రాయి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆరోగ్యంగా తయారై చదువుల్లో రాణించాలని ప్రభుత్వం అవసరమైన వైద్య సేవలు అందిస్తుందని ఎంఎల్‌హెచ్‌వో కృష్ణవేణి అన్నారు. తుమ్మగూడెం ఉర్దూ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు గురువారం డెంటల్ ఇతర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఐరన్ మాత్రలు మింగించారు. హెచ్ఎం గంపా వెంకట్రావు, ఏఎన్ఎం రాణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

'హీల్' సేవలు అభినందనీయం

ఆగిరిపల్లి,అక్టోబరు30(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అందజేస్తున్న హీల్ సంస్థ సేవలు అభినందనీయమని ఎంపీడీవో బి.భార్గవి అన్నారు. ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో గల హీల్ కృత్రిమ అవయవ కేంద్రంలో గురువారం దంత వైద్యులు గూడూరు విజయ్ శ్రీనివాస్, నీరజ దంపతుల షష్టి పూర్తి సందర్భంగా వారు అందించిన విరాళంతో ఏలూరుకు చెందిన తరగళ్ల రాజేష్‌కు కృత్రిమ కాలును ఎంపీడీవో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హీల్ పారడైజ్ చిల్డ్రన్స్ హోమ్‌లోని వెయ్యి మంది బాలలకు అన్నవితరణతో పాటు, కృత్రిమ కాలుకు విరాళామందించిన దంపతులను అభినందించారు. హీల్ సీఈవో కూరపాటి అజయ్ కుమార్, నరసింగపాలెం గ్రామ కార్యదర్శి ఎస్కే హుస్సేన్, సీనియర్ టెక్నికల్ కె.చిన్నా, తదితరులు పాల్గొన్నారు.